తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
వరంగల్ - ఆదిలాబాద్
హన్మకొండ | జనగాం | ములుగు | నిర్మల్ | మంచిర్యాల
ప్రొ॥ జయశంకర్ భూపాలపల్లి | కొమురం భీం ఆసిఫాబాద్
మహబూబాబాద్
శుక్రవారం
5 జూన్ 2026
పేజీలు - 8

# నేడు పోచాపూర్, లింగాల గ్రామాల్లో ప్రజా దర్బార్

● జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు

**ములుగు ప్రతినిధి, జూన్ 04(జనంసాక్షి) :** రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు ప్రజల సమస్యలను స్థానికంగానే తెలుసుకొని పరిష్కరించే విధంగా గ్రామాలలో ఏర్పాటు చేస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడ్వాయి మండలం పోచాపూర్ గ్రామంలోని ఆశ్రమ పాఠశాలలో బిట్టుపల్లి, బంధాల, పోచాపూర్, నర్సాపూర్ పిఎల్,బోల్లెపల్లి గ్రామాల ప్రజలకు శుక్రవారం ఉదయం 9గంటలకు, లింగాల గ్రామంలోని గ్రామపంచాయతీలో ఒడ్డుగూడెం, అల్లిగూడెం, లింగాల, బోటి లింగాల, లవ్వాల గ్రామాల ప్రజలకు 10 గంటలకు రాష్ట్ర పంచాయతీరాజ్,



గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నేరుగా ప్రజల సమస్యలను తెలుసుకుని వాటికి పరిష్కార మార్గం చూపడానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సమక్షంలో తాడ్వాయి మండలంలోని పోచపూర్, లింగాల గ్రామాలలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, రెండు గ్రామాల పరిధిలోని ఫిర్యాదుదారులు తమ స్థానిక సమస్యలు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన విన్నపాలను ఈ సందర్భంగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని ఆయన తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ సమస్యలపై దరఖాస్తులను అందజేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ప్రజా దర్బార్ కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ, డీఎఫ్ఓ, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, ఆర్డీఓ, అన్ని శాఖల జిల్లా అధికారులు, అన్ని శాఖల ఇంజనీరింగ్ ఉన్నత అధికారులు, సంబంధిత మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.



# నీడ లేదు .. ఫోటో రాదు..

## ఎండలోనే ఉపాధి కూలీలు

**శాయంపేట, జూన్ 4 (జనంసాక్షి) :** శాయంపేట మండలంలోని గట్ల కనపర్తి గ్రామంలో ఉపాధి హామీ కూలీలు ఫోటో రాక ఎండలోనే నిలబడి చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ఉదయం వచ్చి పని చేసే సమయం కన్నా ఫోటో దిగే సమయమే ఎక్కువ అవుతుందని బాధను వ్యక్తం చేస్తున్నారు. ఫోటో దిగకపోతే హాజరు పడదు అనే భయంతో ఆ ఎండలోనే నిలుచుకుంటూ తమ వంతు ఫోటో దిగే సమయం ఎప్పుడు వస్తుందా అని వేచి చూస్తున్నారు. ఉపాధి హామీ కూలీలకు టెంటు వేసి, నీరు అందించాల్సిన అధికారులు , ఒక చెట్టు కిందికి అందర్నీ తీసుకువచ్చి ఎండలో నిలబెట్టి ఫోటోలు తీయడమేంటని కూలీలు బాధను వ్యక్తం చేస్తున్నారు. ఈ ఫోటో దిగే పద్ధతిని వెంటనే అధికారులు తీయించి వేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఉపాధి హామీ కూలీలు కోరుకుంటున్నారు.

# రైతులు పంటమార్పిడిపై దృష్టి పెట్టాలి

- ఆదాయం వచ్చే పంటల వైపు మొగ్గు చూపాలి
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

వార్త మెయిన్ 7లో

# నాలుగు రోజుల్లో కొనుగోళ్లు పూర్తి చేయాలి

- ట్రక్ షీట్, రిజిస్టర్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి
- అదనపు ట్రాక్టర్ల వినియోగంతో రవాణా ప్రక్రియ వేగవంతం
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

వార్త మెయిన్ 7లో

# రూ 6.25 లక్షల విలువ గల వాసిస్ గంజాయి స్వాధీనం

**ఏటూరునాగారం, జూన్ 04(జనంసాక్షి) :** మండల పోలీస్ స్టేషన్ పరిది లోని జీడివాగు లో 526 గ్రాముల వాపీస్ ఆయిల్ (లిక్విడ్ గంజాయి) - 526 గ్రాములు (ఒక ప్యాకెట్), సుమారు విలువ రూ.6,25,000/- (సుమారు 12.25,000/-) పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఏటూరునాగారం సిఐ ఎ శ్రీనివాస్ ఆదేశాల మేరకు పోలీస్ స్టేషన్ పరిధి లోని బీడివాగు వద్ద ఎస్ఐ బి మహేష్, పిసి లు హరీష్, చంద్రమోహన్, సదానందం, సుధాకర్ మరియు మహిందర్ లతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడ నల్లరంగు బజాజ్ ప్లాటినా మోటార్ సైకిల్ నెంబరు టిఎస్ 04 ఎఫ్ఈ 7941 (చాసిస్ సంబదు ఎండి 2ఎ 76ఎ ఎక్స6 ఎంపిఎ 44805) పై మొండికుంట గ్రామం నుండి మహారాష్ట్ర రాష్ట్రంలోని సిరోంచ వైపు హపీష్ అయిల్ (లిక్విడ్ గంజాయి)ను విక్రయ నిమిత్తం



తరలిస్తున్న క్రింది నిందితులను గుర్తించి అడ్డగించి పట్టుకున్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మల్లెలమడుగు (మొండికుంట) గ్రామానికి చెందిన నల్లగట్ల సురేంద్ర కుమార్, బండ్ల పాయి అనే నిందితులను విదారించగా, వారు ఒడిశా రాష్ట్రంలోని కుమురచనూరు సమీప నివాసి రాజు నాయక్ (సెల్ నెం 9014568508) అనే వ్యక్తి నుండి హపీష్ అయిల్ కొనుగోలు చేసినట్లు ఒప్పుకున్నారు. అనంతరం పిర్యాదుదారుడు ఇద్దరు మధ్యవర్తుల సమక్షంలో ఒప్పుకోలు- పీజ్ పంచరామా నిర్వహించి క్రింది ఆస్తిని స్వాధీనం చేసుకున్నాడు. హపీప్ ఆయిల్ (లిక్విడే గంజాయి) 526 గ్రాములు (ఒక ప్యాకెట్), సుమారు విలువ రూ.6,25,000, బజాజ్ ప్లాటినా మోటార్ సైకిల్, ఒక వివే వై19 మొబైల్ ఫోన్, ఒక శాంసంగ్ ఎస్23 ఎఫ్ఈ మొబైల్ ఫోన్లను స్వాదీనం చేసుకున్నారు.



# తక్కువ వర్షపాతానికి అనుగుణంగా పంటల సాగు చేయాలి

● కలెక్టర్ భవేశ్ మిశ్రా

**కుంటాల, జూన్ 4(జనంసాక్షి) :** ఈ ఏడాది తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు. గురువారం కుంటాల మండలం అంబగంటి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌తో కలిసి పాల్గొన్న ఆయన, పంట మార్పిడి పద్ధతులు అవలంబించి తక్కువ నీటి అవసరమయ్యే పంటలను సాగు చేయాలని సూచించారు. నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, లైసెన్స్ పొందిన దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేసి బిల్లులు తీసుకోవాలని తెలిపారు. అలాగే ఆయిల్ పామ్ సాగు, డ్రిప్ ఇరిగేషన్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. వర్షాకాలంలో పరిశుభ్రత పాటించాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, వర్షపు నీటి సంరక్షణకు సోక్‌పిట్లు నిర్మించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఇద్దరు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారు. అంతకుముందు కలెక్టర్, ఎమ్మెల్యే గ్రామ మహిళా సంఘ భవనం, జీవనోపాధి ఆర్థిక సాధికారిత కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఫిట్నెస్ లేకుండా స్కూల్ బస్సులు నడపొద్దు

- ఇప్పటివరకు 286 బస్సులు ఫిట్నెస్ అయ్యాయి
- ఇంకా 164 బస్సులు ఫిట్నెస్ కావాల్సి ఉంది
- వరంగల్ రోడ్డు ట్రాన్స్పోర్ట్ ఆఫీస్ రంగారావు



వరంగల్ బ్యూరో, జూన్ 04 (జనం సాక్షి) ఫిట్నెస్ లేకుండా స్కూల్ బస్సుల తో పాటు ఇతర విద్యాసంస్థల బస్సులు నడిపితే తగిన చర్యలు తీసుకుంటామని వరంగల్ రోడ్డు ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్ రంగారావు తెలిపారు. ఫిట్నెస్ అనేది ప్రతి సంవత్సరం మే 15 వరకు ఉంటుం దని ఆ తర్వాత మళ్లీ విద్యాసంస్థల బస్సులకు తప్పనిసరిగా ఫిట్నెస్ చేయించుకోవాల్సిన అవసరం ఉంది. ఈ క్రమంలో ఆర్టీవో రంగా రావు జనం సాక్షితో మాట్లాడారు. వరంగల్ ఆర్టిఏ పరిధిలో మొత్తం సుమారు 450 విద్యాసంస్థలకు చెందిన బస్సులు ఉన్నాయని తెలిపా రు. ఇందులో ఇప్పటివరకు 256 బస్సులు ఫిట్నెస్ అయ్యాయని. సుమారు మరో 164 బస్సులు ఫిట్నెస్ కావలసి ఉందని పేర్కొన్నారు. జూన్ 12వ తేదీ నుండి పాఠశాలలు తిరిగి ప్రారంభం అవుతున్న సందర్భంలో ప్రతి ఒక్క స్కూల్ విద్యాసంస్థల యాజమాన్యాలు తప్పకుండా తమ స్కూల్ బస్సులను ఫిట్నెస్ అయ్యేలా చూడాలని సూచించారు. తాము తనిఖీలు నిర్వహిస్తున్న సందర్భంలో ఫిట్నెస్ లేకుండా బస్సులు బయట రోడ్డు మీద తిరిగితే చర్యలు తీసుకుంటామని ఆయా బస్సులపై 5 వేల రూపాయల ఫైన్ వేయడంతో పాటు బస్సులకు కావలసిన అన్ని రకాల ఇన్సూరెన్స్, పర్మిట్ ఇవన్నీ లేకపోయినా కూడా వాటికి కట్టాల్సిన డబ్బులు కట్టి తీరాల్సిందేనని ఆర్టీవో రంగారావు తెలిపారు. పిల్లలను ఆయా విద్యాసంస్థలకు తరలించే బస్సులు కండిషన్ గా ఉండాలని, దీన్ని బాధ్యతగా తీసుకొని ఆయా యాజమాన్యాలు, నిర్వాహకులు తప్పనిసరిగా బస్సులకు ఫిట్నెస్ చేయించాలని కోరారు.

## సామాజిక న్యాయం కమ్యూనిస్టుల తోనే సాధ్యం



నల్లబెల్లి, జూన్ 04 (జనంసాక్షి): సామాజిక, ఆర్థిక న్యాయం కమ్యూనిస్టుల తోనే సాధ్యమని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, జనగామ జిల్లా మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సుమంగళి ఫంక్షన్ హాల్ లో ఈనెల 3, 4, 5 తారీకులలో జరుగుతున్న జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులకు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 72 సంవత్సరాలుగా దేశంలో ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయాన్ని సాధించడంలో కాంగ్రెస్, బిజెపి, ఇతర ప్రాంతీయ పార్టీలు విఫలం చెందాయని విమర్శించారు. బిజెపి పాలనలో దేశం సంక్షోభంలో కూరుకుపోయిందని తెలిపారు. ప్రభుత్వ భూములను తక్కువ ధరలకు కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతూ ప్రజాధనాన్ని దోచిపెడుతున్నారని ఆరోపించారు. రాబోయే రోజుల్లో పార్టీ కార్యకలాపాలకు అనుగుణంగా ఉద్యమాలను రూపొందిస్తామన్నారు. విద్య, వైద్యం, ఉపాధి వంటి అంశములతోపాటు ప్రజల సమస్యల పరిష్కారానికై ప్రజాక్షేత్రంలోకి పార్టీ శ్రేణులు వెళ్లాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో దేశంలో కమ్యూనిస్టులు, వామపక్షాల అభ్యుదయవాదులు అధికారంలోకి రావాడాన్ని ఎవరు ఆపలేరని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గీసుకొండ మండల కార్యదర్శి గుండె బద్రి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ప్రసాద్, నాయకులు దండు లక్ష్మణ్, పంచాల రమేష్, కృష్ణ, విజయక్క తదితరులు పాల్గొన్నారు.

## యువత చెడు వ్యసనాల బారిన పడవద్దు

### నర్సంపేట ఏసిపి రవీందర్ రెడ్డి



చెన్నారావుపేట, జూన్ 4 ( జనం సాక్షి): గ్రామాల్లోని యువత చెడు వ్యసనాల బారిన పడవద్దని నర్సంపేట ఏసిపి రవీందర్ రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు పోలీస్ జాగృతి కళాబృందం వారు మగ్దంపురం గ్రామంలో కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని యువకులు, గంజాయి, డ్రగ్స్, గుట్కా మత్తు పదార్థాల బారిన పడవద్దని అన్నారు. ఎవరైనా గంజాయి అమ్మిన సేవించిన వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. యువత చదువుపై దృష్టి కేంద్రీకరించి మంచి ఉన్నత స్థానాల్లో నిలవాలని కోరారు. అనంతరం పోలీస్ జాగృతి కళాబృందం వారు మూఢనమ్మకాలు, బాల్య వివాహాలు, రోడ్డు ప్రమాదాలు, మాదకద్రవ్యాలు, చదువు, సైబర్ క్రైమ్స్, ఆన్లైన్ బెట్టింగ్, 1930 సైబర్ హెల్ప్ లైన్ నెంబర్, చైన్ స్నాచింగ్ తదితర అంశాలపై నాటికలు, పాటల ద్వారా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అలాగే మూఢనమ్మకాలపై చేసిన మ్యాజిక్ షో పలువురిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో చెన్నారావుపేట ఎస్సై రాజేష్ రెడ్డి, 11వ వార్డు కౌన్సిలర్ చీకటి స్వరూప ఒదయ్య గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొమ్మాలు, పోలీస్ జాగృతి కళాబృందం ఇన్చార్జి ఏఎస్ఐ నాగమణి, సభ్యులు, హెడ్ కానిస్టేబుల్స్ విలియం, రత్నయ్య, పోలీస్ కానిస్టేబుల్ పూల్ సింగ్, హోంగార్డులు శ్రీనివాస్, నారాయణ, విక్రం రాజు, చిరంజీవి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



రేగొండ,జూన్04 ( జనం సాక్షి):గ్రామాల సమస్యలను గుర్తించి,మౌలిక సదుపాయాలు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ తదితర అంశాలపై ప్రజల అభిప్రాయాలను సేకరించడమే గ్రామ సభల ప్రధాన ఉద్దేశమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు.ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం రేగొండ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ పెన్షన్లు, రేషన్ కార్డులు, రైతు సంక్షేమ పథకాలు సహా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతున్నాయా లేదో గ్రామస్థులు పరిశీలించాలని సూచించారు.గ్రామ స్థాయి నుంచే సమగ్ర అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి, ప్రజల అవసరాలకు అనుగుణంగా చర్యలు చేపట్టి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ విజయ లక్ష్మి,గ్రామ సర్పంచ్ వారణాసి మౌనిక,ఎంపీడీఓ వెంకటేశ్వర రావు, ఎమ్మార్వో శ్వేతారావు,స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,గ్రామస్థులు పాల్గొన్నారు.

# పంట అవశేషాల కాల్చివేతపై సంపూర్ణ నిషేధం

- ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: జిల్లా కలెక్టర్ జిల్లా మేజిస్ట్రేట్ చాహత్ బాజ్పాయ్



హనుమకొండ, ప్రతినిధి జూన్ 4 (జనం సాక్షి) :పంట అవశేషాలను కాల్చడం వల్ల వాయు కాలుష్యం పెరగడంతో పాటు పర్యావరణ సమతుల్యత దెబ్బతిని, నేల సారవంతత తగ్గిపోవడం, ప్రజారోగ్యం ప్రమాదంలో పడటం వంటి తీవ్ర పరిణామాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో హనుమకొండ జిల్లా వ్యాప్తంగా పంట వ్యర్థాల కాల్చి వేతనుతక్షణమే నిషేధిస్తూ జిల్లా కలెక్టర్ జిల్లా మేజిస్ట్రేట్ శ్రీమతి చాహత్ బాజ్పాయ్ ఉత్తర్వులు జారీ చేశారు.వ్యవసాయ పంటల కోత అనంతరం పొలాల్లో మిగిలిపోయే పంట అవశేషాలను తగులబెట్టడం వల్ల హానికర వాయువులు వెలువడి వాతావరణ కాలుష్యం పెరగడమే కాకుండా, ప్రజల ఆరోగ్యం, మానవ జీవనం, రహదారి భద్రత మరియు పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.జిల్లాలోని తహశీల్దార్లు, ఎంపీడీఓలు, వ్యవసాయ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, పోలీస్ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది గ్రామాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, పంట కోతల సమయంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, ఉల్లంఘన నలకు పాల్పడిన వారిపై వెంటనే చర్యలుచేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.అదేవిధంగా వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, కాలుష్య నియంత్రణ శాఖలు సమన్వ యంతో పనిచేసి ఉత్తర్వులను కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచి ంచారు. పంట అవశేషాలను కాల్చడం అంటే భూమాతను, పర్యావరణాన్ని, మన భవిష్యత్తును కాల్చినట్లే. రైతులు ప్రత్యామ్నాయ పద్ధతులను అనుసరించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి. ప్రతి గ్రామం కాలుష్య రహితంగా, ప్రతి పొలం సారవంతంగా ఉండేలా అందరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయ్ పిలుపునిచ్చారు.

## మహిళలకు ఉపాధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలి

హనుమకొండ ప్రతినిధి జూన్ 4 (జనం సాక్షి) : హనుమకొండ జిల్లాలో మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ద్వారా ఉపాధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా దామెర మండలం ల్యాదేళ్లలోని మహిళా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా సెంటర్ ద్వారా నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాలు, శిక్షణకు సంబంధించిన మెటీరియల్, సెంటర్ లోని వివిధ శిక్షణ విభాగాలను పరిశీలించారు. సౌకర్యాలను పరిశీలించి కేంద్రం గురించిన వివరాలను డిఆర్డిఓ మేన శ్రీను, అధికారులు కలెక్టర్ కు వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ మహిళలకు ఉపయోగపడే విధంగా వారం రోజుల్లో శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ద్వారా శిక్షణ కార్యక్రమాలను మహిళలు సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం మండల సమైక్య కార్యాలయం కోసం శంకుస్థాపన చేసిన భూమి వివరాలను తహసిల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచి రవి యాదవ్, అడిషనల్ డిఆర్డిఓ లక్ష్మీ ప్రసన్న, ఎంపీడీవో కల్పన, డీపీఎం రాజేంద్రప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలి

### ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు



మహబూబాబాద్ బ్యూరో, జూన్ 04(జనం సాక్షి):మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో రోడ్లు మొత్తం దుమ్ము ధూళితో నిండిపోయాయని వెంటనె నిలిచిపోయిన రోడ్ల పనులను పూర్తీ చేయాలని, లేదంటే కొద్దీ రోజుల్లోనే బిఆర్ఎస్ పార్టీ తరుపున పోరాటానికి సిద్ధమవుతామని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహబూబాబాద్ ఆర్టీసీ బస్టాండ్ నుండీ ఈదులపుసల్లి వరకు బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రోడ్డు నిర్మాణం చెశారని , చివరి దశలో కొంత పనులు పూర్తీ కాలేదని, నేటికీ దాదాపు మూడు సంవత్సరాలు గడుస్తున్నా పనులు పూర్తీ చేయకపోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను చూసి బి ఆర్ ఎస్ శ్రేణులు అధికారులతో పర్యటించి వెంటనె చివరి దశలో ఉన్న నిర్మాణ పనులను పూర్తీ చేయాలని డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ రామ్మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ మార్నేని వెంకన్న, వార్డ్ కౌన్సిలర్ చిట్యాల జనార్దన్, ముత్యం వెంకన్న, బిఆర్ఎస్ నాయకులు జెర్రిపోతుల వెంకన్న , బానోతు రవికుమార్, ఎద్దు వేణు, రఘు, శంకర్, ఏనమల అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాకు గంజాయి టెస్టింగ్ కిట్స్



**మహబూబాబాద్ బ్యూరో, జూన్ 04(జనం సాక్షి):**మహబూబాబాద్ జిల్లాలో గంజాయి వినియోగం, రవాణా, విక్రయాలను పూర్తిగా నిర్మూలించి జిల్లాను గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు జిల్లా పోలీసు శాఖ పటిష్ట చర్యలు చేపట్టిందని జిల్లా పోలీసు అధికారి డాక్టర్ శబరీష్ తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు మరియు వినియోగాన్ని అరికట్టేందుకు జిల్లాలో ప్రత్యేక పోలీసు బృందాలు నిరంతరం నిఘా నిర్వహిస్తున్నాయని తెలిపారు. డీఎస్పీల పర్యవేక్షణలో సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది రాత్రి వేళల్లో విస్తృతంగా గస్తీ నిర్వహిస్తూ అనుమానాస్పద ప్రాంతాలు, నిర్జన ప్రదేశాలు, యువత ఎక్కువగా గుమికూడే ప్రాంతాలు, గంజాయి వినియోగానికి అవకాశం ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు.గంజాయి గుర్తింపునకు ఉపయోగపడే అత్యాధునిక 4000 గంజాయి టెస్టింగ్ కిట్లు ప్రస్తుతం జిల్లా పోలీసు శాఖకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లాలోని ఎస్ఐలు, పోలీసు సిబ్బంది ఈ కిట్లను విధుల్లో భాగంగా వెంట తీసుకెళ్తూ అనుమానిత వ్యక్తులు లేదా పదార్థాలను అక్కడికక్కడే పరీక్షించి కేవలం 10 నిమిషాల్లో ఫలితాలు పొందగలరని చెప్పారు. దీంతో గంజాయి సేవిస్తున్న వారిని, గంజాయి కలిగి ఉన్న వారిని వెంటనే గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడం మరింత సులభమవుతుందని తెలిపారు.జిల్లాలో ఎక్కడైనా గంజాయి విక్రయం, వినియోగం లేదా రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే 8712656999 నంబర్‌కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు.తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక నిఘా ఉంచాలని, గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండేలా అవగాహన కల్పించాలని సూచించారు. సమాజ శ్రేయస్సు కోసం ప్రజలు, మీడియా ప్రతినిధులు, విద్యాసంస్థల యాజమాన్యాలు, ప్రజాప్రతినిధులు పోలీసులకు సహకరించి మహబూబాబాద్ జిల్లాను గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు భాగస్వాములు కావాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. గంజాయి నిర్మూలన కోసం జిల్లా పోలీసు శాఖ నిరంతరం కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తోందని, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతి రావు, తొర్రూరు డీఎస్పీ కృష్ణ కిషోర్, మహబూబాబాద్, తొర్రూరు సర్కిల్ సీఐ లు పాల్గొన్నారు.

# సర్వాపూర్‌కు బస్ సర్వీస్ ప్రారంభం



**నడికుడ జూన్ 4 (జనం సాక్షి) :** ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ప్రత్యేక చొరవతో నడికుడ మండలం సర్వపూర్ గ్రామానికి బస్సు సర్వీస్ ఏర్పాటు చేయడం జరిగింది. గురువారం సర్వపూర్ గ్రామపంచాయతీ నందు నూతనంగా కొత్త బస్సు సర్వీస్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి నడి కూడ మండల పరిషత్ అభివృద్ధి అధికారి రామకృష్ణ సర్వాపూర్ గ్రామ సర్పంచ్ భోగి శ్రీలత ముఖ్య అతిథులుగా హాజరై రిబ్బన్ కట్ చేసి జెండా ఊపి బస్ సర్వీస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఇటీవల గ్రామంలో గవర్నమెంట్ పాఠశాలలో చదివి 10వ తరగతి ఉత్తీర్ణులైన మన గ్రామ బాల బాలికలకు ఫెల్ స్టేషన్ చేసి ప్రభుత్వ పాఠశాల యొక్క గొప్పతనాన్ని వివరించడం జరిగింది అని చెప్పుతూ గ్రామంలో గత పది సంవత్సరాల నుండి బస్సు సౌకర్యం లేనందున కాలేజ్ కి వెళ్లే పిల్లలకు బతుకుదెరువు కోసం సిటీ వెళ్లే కార్మికులు ముసలి వాళ్లు గర్భిణీ స్త్రీలు ఎంతో కాలంగా ఇబ్బంది పడుతున్న మన గ్రామానికి బస్సు రావడానికి చేసిన కృషి ఫలించింది సర్పంచ్ పోటీకి ముందు ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకున్నందుకు గ్రామస్తులు సంతోషించినారు అందుకుగాను ప్రజాప్రతినిధులకు ధన్యవాదములు తెలియజేయడం జరిగింది మహిళా సర్పంచ్ అయినా భోగి శ్రీలత పట్టుదలతో చేసే పనులను చూసి ఎంపీడీవో అభినందించారు కొత్తగా వచ్చిన బస్సు డ్రైవర్ కి మరియు కండక్టర్స్ కి శాలువాలతో సత్కరించడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ దండు లక్ష్మయ్య వార్డు సభ్యులు పార్టీ అధ్యక్షులు భోగి మనోహర స్వామి ఇందిరమ్మ కమిటీ మెంబర్స్ జిల్లా నాయకులు మండల నాయకులు కౌకొండ గ్రామ నాయకులు నడికుడ గ్రామ సర్పంచ్ మలహాలు రావు సర్వపూర్ గ్రామ నాయకులు అంగన్వాడి టీచర్ మరియు సిఏ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల వారీగా పంచాయతీ కార్యదర్శుల నియామకం

## చెన్నారావుపేట ఎంపీడీవో వెంకట సాయి శివానంద్

**చెన్నారావుపేట, జూన్ 4 ( జనం సాక్షి):** గ్రామాల వారిగా పంచాయతీ కార్యదర్శులు నియామకమైనట్లు చెన్నారావుపేట ఎంపీడీవో వెంకట సాయి శివానంద్ గురువారం తెలిపారు. సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లా పంచాయతీ అధికారి కల్పన ఆదేశాల మేరకు గ్రామాల వారీగా కార్యదర్శులు బాధ్యతలను తీసుకున్నట్లు తెలిపారు. 16 చింతల తండా గ్రామ కార్యదర్శిగా స్వరాజ్యం, అక్కల్ చెడ గ్రామానికి చేరాలు, అమీనాబాద్ గ్రామానికి సుమలత, అమృతండా గ్రామానికి రవి( డిప్యూటేషన్ ), బాపునగర్ గ్రామానికి గొల్లభామ తండా కార్యదర్శి సంతోష్ (డిప్యూటేషన్) , బోడ మాణిక్యం తండా గ్రామానికి శ్రీదేవి, భోజేర్వు గ్రామానికి అనిల్ కుమార్, చెన్నారావుపేట గ్రామానికి సుప్రజ, చెరువు కొమ్ము తండా గ్రామానికి ప్రియాంక, ధర్మ తండా గ్రామానికి చిత్తరంజన్, గొల్లభామ తండా గ్రామానికి సంతోష్, గొల్లపల్లె గ్రామానికి ప్రదీప్, జీడిగడ్డ తండా గ్రామానికి నరసింహ రాములు ఇన్చార్జి కార్యదర్శిగా, జల్లి గ్రామానికి మల్లికార్జున్, జోజిపేట నారాయణ తండా గ్రామానికి జ్యోతి, కాల్ నాయక్ తండ గ్రామానికి నరసింహ రాములు, కంది గడ్డ తండా గ్రామానికి మహేష్, ఖాదర్ పేట గ్రామానికి భరత్, కోనాపురం గ్రామానికి షాహిద్ పాషా, లింగాపురం గ్రామానికి అనిత, లింగగిరి గ్రామానికి శ్యాంప్రసాద్, పాపయ్యపేట గ్రామానికి రాజు, పత్తి నాయక్ తండ గ్రామానికి కళ్యాణి, పుల్లయ్యబోడు తండా గ్రామానికి స్వప్న, శంకరం తండా గ్రామానికి కల్పన, సూర్యాపేట తండా గ్రామానికి ఉష,



తిమ్మరాయిని పహాడ్ గ్రామానికి రాంబాబు, తోపనగడ్డ తండ గ్రామానికి శ్రీనాథ్, ఉప్పరపల్లి గ్రామానికి కృష్ణంరాజు, ఎల్లాయగూడెం గ్రామానికి వికాస్ లు బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు.

# గ్రామాల్లో వర్షాకాలం సన్నద్ధత పై గ్రామసభలు

## చెన్నారావుపేట ఎంపీడీవో వెంకట సాయి శివానంద్



**చెన్నారావుపేట, ఏప్రిల్ 4 ( జనం సాక్షి):** వర్షాకాలం సన్నద్ధత పై గ్రామాలలో గ్రామ సభలను నిర్వహించినట్లు ఎంపీడీవో, చెన్నారావుపేట గ్రామ స్పెషల్ ఆఫీసర్ వెంకట సాయిశివానంద్ తెలిపారు. గురువారం చెన్నారావుపేట, జోజిపేట నారాయణ తండా, ధర్మ తండా, బోజేర్వు, అమృతండా, పాపయ్యపేట గ్రామాలలో గ్రామసభలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రత, మొక్కల పెంపకం, ఘన వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ వాడకం నిషిద్ధం, వన మహోత్సవం, సురక్షిత త్రాగునీరు, వరద నిర్వహణ భద్రత, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాలపై గ్రామ సభలలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వర్షాకాలంలో గ్రామాలలోని పైన పేర్కొనబడిన అంశాల పట్ల అవగాహన కల్పించి సన్నద్ధం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాపయ్యపేట గ్రామ స్పెషల్ ఆఫీసర్, మండల పంచాయతీ అధికారి తండ జగదీష్, అమృతండా గ్రామ స్పెషల్ ఆఫీసర్, పంచాయతీరాజ్ ఏఈ సృజన్ కుమార్, జోజిపేట నారాయణ తండా గ్రామ స్పెషల్ ఆఫీసర్ మిషన్ భగీరథ ఇంట్రా ఏఈ రణధీర్, ధర్మ తండా స్పెషల్ ఆఫీసర్ ఏపీఓ అరుణ, భోజేర్వు స్పెషల్ ఆఫీసర్ మండల విద్యాశాఖ అధికారిని పాపమ్మ, లింగాపురం, చెన్నారావుపేట జిపిఓలు రవీందర్, విజయలక్ష్మి, మండల వ్యవసాయ అధికారి గోపాల్ రెడ్డి, సిహెచ్ఓ భద్రయ్య, గ్రామ సర్పంచులు లావుడియా చందు, కుసుమ సతీష్, బుర్ర సుదర్శన్ గౌడ్, బోడ వీరాసింగ్, బోడ రవి, పంచాయతీ కార్యదర్శులు రవి, రాజు, సుప్రజ, చిత్తరంజన్, జ్యోతి, అనిల్ కుమార్, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# బడిబాట కార్యక్రమంలో భాగంగా విస్తృత ప్రచారం



**కాళేశ్వరం , జూన్ 05 , ( జనం సాక్షి)**ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపు లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం అన్నా రం గ్రామంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పి.ఎం. శ్రీ జడ్పీహెచ్ఎస్ కాళేశ్వరం ప్రధానోపాధ్యాయులు దొనికల రాజేందర్ ఆధ్వర్యంలో గ్రామంలోని ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశంలో తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సౌకర్యాల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నీర్ల ప్రభాకర్, ఉపసర్పంచ్ పర్సవేన సమ్మయ్య, గ్రామ కార్యదర్శి కుమారస్వామి, వార్డు సభ్యులు, స్థానిక ప్రాథమికోన్నత పాఠశాల అన్నారం ప్రధానోపాధ్యాయులు హట్కర్ రతన్ సింగ్ మరియు ఉపాధ్యాయులు సి ఆర్ పి లు బానయ్య, సతీష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ఆసక్తి చూపారు. బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ విద్యపై ప్రజల్లో మరింత అవగాహన పెరుగుతుందని పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు.

# సర్కారు బడిలోనే సకల సౌకర్యాలు

## హెచ్ఎం సట్ల గంగాధర్

**కుబీర్, జూన్ 04, (జనంసాక్షి):** కుబీర్ మండలం కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'బడిబాట' కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సట్ల గంగాధర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం ఉపాధి హామీ కూలీలను కలిసి విద్యపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, నాణ్యమైన భోజనం, ఉచిత పుస్తకాలు, దుస్తులతో పాటు కార్పొరేట్ స్థాయికి ధీటుగా అత్యాధునిక వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ ఏడాది పాఠశాల సాధించిన అద్భుత ఫలితాలను చూసి కూలీలు ఆనందం వ్యక్తం చేశారు. పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని ఆయన కోరా రు. ఉపాధ్యాయుల చొరవకు కూలీలు సానుకూలంగా స్పందిస్తూ, తమ పిల్లలను సర్కారు బడికి పంపిస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## జిల్లా కలెక్టర్‌ను కలిసిన బెల్లంపల్లి ఏరియా నూతన జీఎం రమేష్



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 04(జనంసాక్షి ):**బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ (జీ ఏం )గా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఎం. రమేష్ గురువారం కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె. హరిత ను జిల్లా కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సమావేశంలో బెల్లంపల్లి ఏరియా పరిధిలోని బొగ్గు ఉత్పత్తి, కొత్త గనుల విస్తరణపై కలెక్టర్‌తో జీఎం సుదీర్ఘంగా చర్చించారు. గోలేటి ఓపెన్ కాస్ట్ (ఓ సి ) ఆవశ్యకతబెల్లంపల్లి ఏరియా అభివృద్ధిలో గోలేటి ఓపెన్ కాస్ట్ గని ఎంతో కీలకమైనదని, దీనిని త్వరగా అందుబాటులోకి తీసుకురావాల్సిన ఆవశ్యకతను జీఎం కలెక్టర్‌కు వివరించారు. ప్రస్తుత బొగ్గు ఉత్పత్తిప్రస్తుతం ఏరియా పరిధిలో కేవలం ఒక్క ఖైరిగుడ ఉపరితల గని నుండి మాత్రమే బొగ్గు ఉత్పత్తి జరుగుతోందని ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.కొత్త గనుల ప్రణాళికబెల్లంపల్లి ఏరియాలో భవిష్యత్తులో ప్రారంభం కానున్న గనులు, ప్రస్తుతం ప్రతిపాదనల దశలో ఉన్న వివిధ మైనింగ్ ప్రాజెక్టుల వివరాలను ఈ సందర్భంగా కలెక్టర్‌కు సమర్పించారు.సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కొత్త గనుల ప్రారంభానికి సంబంధించి ప్రభుత్వ పరంగా రావాల్సిన వివిధ రకాల అనుమతులు వేగంగా లభించేలా జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహకారం అందించాలని జీఎం రమేష్ జిల్లా కలెక్టర్‌ను కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

## యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దు

### మంచిర్యాల డీసీపీ భాస్కర్



**బెల్లంపల్లి, జూన్ 4, (జనంసాక్షి)**యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా దూరంగా ఉండాలని మంచిర్యాల డీసీపీ భాస్కర్ అన్నారు. గురువారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సుభాష్ నగర్ లో జరిగిన మత్తు పదార్థాల నియంత్రణ వార్డు సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, యువత భవిష్యత్తుపై, ఆరోగ్యంపై కుటుంబ వ్యవస్థపై ప్రతికూల ప్రభావాల గురించి వివరించారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగాన్ని పూర్తిగా నిరోధించాలని సూచించారు. ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ నేరాల గురించి అవగాహన కల్పిస్తూ, ఆన్‌లైన్ మోసాలు, ఓటీపీ మోసాలు, ఫేక్ ఇన్వెస్ట్‌మెంట్ స్కీములు, సోషల్ మీడియా మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలనన్నారు. ఎలాంటి అనుమానాస్పద కాల్స్, మెసేజ్‌లు, లింక్‌లకు స్పందించవద్దని, సైబర్ మోసాలకు గురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మహిళల భద్రత కోసం పోలీసు శాఖ చేపడుతున్న చర్యలను వివరించారు. మహిళలు ఎలాంటి వేధింపులు ఎదురైనా నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని కోరారు. బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నిర్మూలన, సైబర్ నేరాల నివారణ, మహిళల భద్రత విషయంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ దావ స్వాతి రమేష్, బెల్లంపల్లి టూ టౌన్ ఎస్ఐ సీహెచ్ కిరణ్ కుమార్, బెల్లంపల్లి కమిషనర్ తన్నీర్ రమేశ్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## జల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

### అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి



**నల్లబెల్లి, జూన్ 04 (జనంసాక్షి):** జల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అడిషనల్ కలెక్టర్ సంధ్యా రాణి అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రణాళికలో భాగంగా మండలంలోని మేడపల్లి గ్రామంలో సర్పంచ్ అర్రెమ్ సాంబయ్య అధ్యక్షతన గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని పలు అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. తడి పొడి చెత్తను వేరుగా వేయాలన్నారు. గ్రామంలో త్రాగునీటి ఎద్దడి లేకుండా సురక్షితమైన నీటిని ప్రజలకు అందించాలని సూచించారు. మొక్కల పెంపకం వన మహోత్సవం వంటి కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ముప్పు కృష్ణ, ఇంచార్జ్ ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి అనిల్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రజల సంక్షేమాభివృద్దే ప్రభుత్వ లక్ష్యం

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి, జూన్ 4, జనంసాక్షి**ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో ప్రభుత్వం చేపట్టిన గ్రామ/డివిజన్/వార్డు సభలలో భాగంగా గురువారం జిల్లాలోని హాజీపూర్ మండలం రాపల్లి గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన గ్రామసభకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి సాయి వెంకట్ రెడ్డి, మండల విద్యాధికారి తిరుపతి, సర్పంచ్ రామ్ రెడ్డి లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజాపాలన ప్రగతి ప్రణాళి 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రభుత్వం ఈ నెల 4, 6, 8, 10 తేదీలలో ప్రత్యేక సభలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించడం జరిగిందని తెలిపారు. ఈసారి వర్షం తక్కువగా ఉన్నందున తదనుగుణంగా సాగు చేయగల పంటలను రైతులు ఎంపిక చేసుకోవాలని, ఆ దిశగా వ్యవసాయ, విస్తరణ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. యూరియా పంపిణీకి సంబంధించి యాప్ లో నమోదు చేయబడిన రైతులు, పంట, సాగు వివరాలకు అనుగుణంగా విడతల వారీగా యూరియా అందించడం జరుగుతు ందని తెలిపారు. ఒకే రకమైన పంట సాగు చేయడం వలన భూసారం తగ్గుతుందని, ఈ పరిస్థితిని అధిగమించేందుకు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని, నానో యూరియా, డి ఎ పి, ప్రభుత్వం చేవీకరించబడిన విత్తనాలను మాత్రమే రైతులు వినియోగించాలని తెలిపారు. భూమి రకాన్ని బట్టి దాదాపు పత్తి పంట ఎకరానికి 14 నుండి 15 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని, రైతులకు మద్దతు ధర అందించడం జరుగుతుందని తెలిపారు. చిన్న, సన్న కారు రైతులు ప్రత్యామ్నాయంగా కూరగాయల పంటల సాగుపై దృష్టి సారించాలని, పంట సాగుకు ప్రభుత్వం రాయితీ అందిస్తుందని, ఈ అవకాశాన్ని వినియోగించుకుని లబ్ధి పొందాలని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టడం ద్వారా ఈ సంవత్సరం ఇప్పటివరకు ఎలాంటి డెంగ్యూ కేసులు నమోదు కాలేదని, ఇలాగే కొనసాగించినట్లయితే వ్యాధుల నియంత్రణ సులభతరం అవుతుందని తెలిపారు. ప్రతిరోజు తడి, పొడి చెత్తను సేకరించాలని, ఉపయోగపడే వ్యర్థాల ద్వారా కంపోస్టు చేసి రైతులకు అందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం, జనగణన కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. సమగ్ర సవరణ కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని, ఓటరు మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. జన గణన ప్రక్రియలో వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. విద్యావవస్థ బలోపేతం దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. జూనియర్ కళాశాలలలో విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయడం జరుగుతుందని, ఈ విద్యా సంవత్సరం వార్షిక ఫలితాలలో దాదాపు 98 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం జరిగిందని తెలిపారు. ఈ వేసవిలో ప్రజలకు ఎలాంటి త్రాగునీటి ఇబ్బందులు లేకుండా ముందస్తు కార్యాచరణతో చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. వైద్యం, విద్య, మహిళా రక్షణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు అంశాలపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో ప్రజలకు ఎదురయ్యే సమస్యలపై మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల తహసీల్దార్ల దృష్టికి తీసుకురావచ్చని, టోల్ ఫ్రీ నెంబర్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంపై అధికార యంత్రాంగం సమన్వయంతో పని చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

## నారాయణ పాఠశాల అక్రమ వసూళ్లపై ఏబీవీపీ ఆందోళన -- గదిని సీజ్ చేసిన ఎంఈఓ




**నిర్మల్ బ్యూరో,, జూన్ 4:(జనంసాక్షి)**అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నిర్మల్ శాఖ ఆధ్వర్యంలో గురువారం నారాయణ పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. పాఠశాల యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, యూనిఫాంలు, బెల్టులు, పెన్నులు, కిట్లు విక్రయిస్తూ తల్లిదండ్రులను ఆర్థికంగా దోపిడీ చేస్తోందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో మండల విద్యాశాఖ అధికారి పాఠశాలలోని ఒక గదిని సీజ్ చేశారు.ఈ సందర్భంగా ఏబీవీపీ ఇందూర్ విభాగ్ కన్వీనర్ కైరి శశిధర్ మాట్లాడుతూ, విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే అడ్మిషన్ల పేరుతో వేల రూపాయల ఫీజులు వసూలు చేస్తూ కార్పొరేట్ విద్యాసంస్థలు తల్లిదండ్రులపై భారం మోపుతున్నాయని విమర్శించారు. సీట్లుఅయిపోతాయనే భయాన్ని సృష్టించి ముందస్తు అడ్మిషన్ల పేరిట అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు.పాఠశాల ప్రాంగణంలోనే పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలు, షూస్ తదితర వస్తువులను బయట మార్కెట్ ధరల కంటే అధిక ధరలకు విక్రయించడం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కార్పొరేట్ విద్యాసంస్థలపై టాస్క్‌ఫోర్స్ కమిటీలతో తక్షణమే తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని, ప్రైవేట్ పాఠశాలలు కేవలంవిద్యాబోధనకు సంబంధించిన ఫీజులు మాత్రమే వసూలు చేసేలా స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని ఏబీవీపీ నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ దినేష్, సాయికుమార్, శివకుమార్, మున్నా, పవన్, కార్తీక్, అఖిలేష్, సాయి అక్షయ్, రాంచరణ్, మాల్యాద్రి, శేషు, అశ్వంత్, రాజ్‌కుమార్, రాజేష్, సాయి, శివ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సంఖ్య ఎక్కువ ఉన్న పాఠశాలలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి-జిల్లా పీఆర్టియూ



**నెరడిగొండ జూన్4(జనంసాక్షి):**ఇటీవల ఆదిలాబాద్ జిల్లా విద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన మాధవి మేడం ను గురువారం రోజున పిఆర్టియూ తెలంగాణ సంఘం తరపున పుష్ప గుచ్చాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. రాబోవు వర్క్ అడ్జస్ట్మెంట్ లో భాగంగా విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలలకు ముందుగా ప్రాధాన్యత ఇస్తే బాగుంటుందని వారు డీఈవో ని కోరారు.ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ విద్యాభివృద్ధికి అందరూ సహకరించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పిఆర్టియు తెలంగాణ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆడే నూర్ సింగ్ నర్రా నవీన్ యాదవ్ లతో పాటు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కనక అభిమాన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బి విఠల్ గౌడ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు డి బాబన్న జిల్లా కోశాధికారి ముజీబ్ జాదవ్ శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

# చిట్యాల మండల కేంద్రంలోని గ్రామాల్లో " గ్రామసభలు "



• నకిలీ విత్తనాలు, వర్షాకాల జాగ్రత్తలు, రోడ్డు భద్రతపై పోలీస్ శాఖ అవగాహన

**చిట్యాల, జూన్ 04( జనం సాక్షి):** చిట్యాల మండల పరిధిలోని చల్లగరిగ, జూకల్, చిట్యాల, గుంటూరుపల్లి గ్రామాలలో "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" లో భాగంగా గురువారం గ్రామసభలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో స్థానిక పోలీస్ అధికారులు పాల్గొని, రాబోయే వర్షాకాలం వ్యవసాయ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని గ్రామస్తులకు, రైతులకు పలు కీలక అంశాలపై విస్తృత అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా చిట్యాల ఎస్ఐ పోచంపల్లి సతీష్ మాట్లాడుతూ..ప్రస్తుత వానాకాలం సీజన్ ప్రారంభమైనందున రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన డీలర్ల వద్దే విత్తనాలు కొనాలని, తప్పనిసరిగా రసీదు (బిల్లు) తీసుకోవాలని కోరారు. ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు లేదా వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు.ఈ సీజన్‌లో ఎల్‌నినో ప్రభావం వల్ల ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, రైతులు పొలం పనుల్లో ఉన్నప్పుడు వర్షం వస్తే చెట్ల కింద ఆశ్రయం పొందకూడదని హెచ్చరించారు. పిడుగుపాటు ప్రమాదాల నుండి తప్పించుకోవడానికి సురక్షిత ప్రాంతాలలో ఉండాలని,పొలాల వద్ద గట్ల విషయంలో వచ్చే చిన్న చిన్న తగాదాలను పెద్దవి చేసుకొని శాంతిభద్రతల సమస్యలుగా మార్చుకోవద్దని హితవు పలికారు. ఎలాంటి సమస్యలైనా గ్రామంలో పెద్దల సమక్షంలో లేదా పోలీస్ స్టేషన్ పరిధిలో చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలే తప్ప, గొడవలకు దిగి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని స్పష్టం చేశారు.'అరైవ్ అండ్ అలైవ్' నినాదంతో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో రోడ్లు జారుడుగా ఉంటాయని, వాహనదారులు వేగ పరిమితిని పాటించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయశ్రీ, ఎమ్మార్వో వసంతరావు, చిట్యాల సర్పంచ్ తౌటమ్ లక్ష్మి– అత్తయ్య, చల్లగరిగ సర్పంచ్ జంపయ్య, గుంటూరు పల్లి సర్పంచ్ నాగమల్లేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ యాకయ్య, చంద్రమౌళి, కానిస్టేబుళ్లు సందీప్, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

# ప్రీ-ప్రైమరీ పాఠశాలలకు ఇన్స్ట్రక్టర్ ఆయా పోస్టుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

## ఎంఈఓ ఎన్. విజయ్ కుమార్



**ఆత్మకూర్, జూన్ 4 (జనం సాక్షి):** తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు, పాఠశాల విద్యాశాఖ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి ఆత్మకూరు మండలంలో రెండు ప్రభుత్వ ప్రీ-ప్రైమరీ పాఠశాలలను ప్రారంభించనున్నట్లు మండల విద్యాధికారి ఎన్.విజయ కుమార్ తెలిపారు. ఎంపీపీఎస్ ఆత్మకూరు, ఎంపీపీఎస్ పెద్దాపూర్ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ విభాగాలు ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో ప్రీ-ప్రైమరీ ఇన్స్ట్రక్టర్, ఆయా పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. ప్రీ-ప్రైమరీ ఇన్స్ట్రక్టర్ పోస్టుకు ఇంటర్మీడియట్ (10+2) లేదా సమాన విద్యార్హత కలిగి ఉండాలని,ప్రారంభ బాల్య విద్య (ఈసీఈ) లేదా ప్రాథమిక బోధనలో అర్హతలు ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు.ఆయా పోస్టుకు కనీసం 7వ తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలని పేర్కొన్నారు. అభ్యర్థుల ఎంపికలో మొదట హాబిటేషన్, అనంతరం గ్రామ పంచాయతీ,మండలం, జిల్లా ప్రాతిపదికన ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు.నోటిఫికేషన్ తేదీ నాటికి అభ్యర్థుల వయస్సు 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలని,ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 5 సంవత్సరాలు ,మాజీ సైనికులకు 3 సంవత్సరాలు, దివ్యాంగులకు 10 సంవత్సరాల వయో సడలింపు వర్తిస్తుందని చెప్పారు. అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులతో పాటు సంబంధిత ధ్రువపత్రాలను సంబంధిత ప్రీ-ప్రైమరీ పాఠశాల సంబంధిత ప్రధానోపాధ్యాయులకు ఈ నెల జూన్ 8వ తేదీలోగా సమర్పించాలని మండల విద్యాధికారి ఎన్.విజ యకుమార్ కోరారు.

# ఇండ్లపై విద్యుత్ తీగల సమస్య పరిష్కరిస్తాం

## విద్యుత్ లేని ఇండ్లకు ఉచితంగా సరఫరా

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):**ఇండ్ల పైనుంచి వెళ్తున్న విద్యుత్ తీగల సమస్యను పరిష్కరిస్తామని, విద్యుత్ లేని ఇండ్లకు ఉచితంగా సరఫరా కల్పిస్తాం అని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు హామీ ఇచ్చారు. గురువారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధి 9వ వార్డు పుల్లూరి రామయ్యపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం జరిగిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక వార్డు సభలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ 99 రోజుల ప్రణాళికలో వ్యవసాయ పొలాలలో విద్యుత్ పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్లు మార్చేందుకు తక్షణమే దరఖాస్తు చేసుకుంటే ఉచితంగా మారుస్తారని, విద్యుత్ సరఫరా లేని ఇళ్లకు పోల్స్ వేసి ఉచితంగా విద్యుత్ ఇచ్చే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. మన ఇంటిని, వాడను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిశుభ్రతతోనే పరిపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని, అటవీశాఖ, సింగరేణి, మున్సిపాలిటీ నుంచి మొక్కలు ఇస్తారని, ప్రతి ఇంటిలో పిల్లల్ని పెంచినట్లే వృక్షాలను పెంచాలని కోరారు. మొక్కలతో వాటి ఫలాలతో పాటు వాతావరణ సమతుల్యత కాపాడవచ్చు అని చెప్పారు.గ్రామాలు, వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పాఠశాలలకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. రైతులు, పేదల పిల్లలు ఐపీఎస్, ఐఏఎస్ అధికారులుగా ఎదగాలని, జూన్ 12న పాఠశాలల ప్రారంభం నాటికి యూనిఫామ్స్, పుస్తకాలు, నోటు పుస్తకాలు అందించి 21 కిట్లతో విద్యార్థులకు వెల్కం చెబుతాం అని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరిక పెంచాలని, విద్య, వైద్య రంగాలపై ప్రభుత్వం ఫోకస్ పెట్టిందని తెలిపారు. రాష్ట్రంలో 78,000 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు, జిల్లాలో 2,700 మంది యువతకు ప్రైవేటు కంపెనీల్లో ఉపాధి కల్పించామని వెల్లడించారు. సింగరేణి, టాస్క్ ద్వారా వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో క్యాథ్ ల్యాబ్ ఏర్పాటు చేస్తున్నామని, కొడవటంచ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయాన్ని యాదగిరిగుట్టలా అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. బుగులోని వెంకటేశ్వరస్వామి దేవాలయానికి రహదారి, కోనేరు, ఐమాక్స్ లైట్లు, కళ్యాణమండపం నిర్మించి అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రజలు జనగణలో పాల్గొనాలని, ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంలో అర్హులైన ప్రతి ఓటరు పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, కమిషనర్ ఉదయ్ కుమార్, తహసీల్దార్ లక్ష్మి రాజయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, డీఎంహెచ్ఓ డాక్టర్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

# 'జీరో హార్మ్' లక్ష్య సాధనకు కట్టుబడి పనిచేయాలి

## ఏరియా జీఎం రాజేశ్వర్ రెడ్డి



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):**ప్రతి ఉద్యోగి భద్రతను అత్యంత ప్రాధాన్యతగా తీసుకొని 'జీరో హార్మ్' లక్ష్య సాధనకు కట్టుబడి పనిచేయాలి అని ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రమాదాల నివారణ, సురక్షితమైన పని వాతావరణం కల్పించడమే లక్ష్యంగా కేటీకే–1 గనిలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక భద్రతా అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రమాదాలను పూర్తిగా నివారించేందుకు భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ అప్రమత్తతతో విధులు నిర్వహించాలని, భద్రతా నియమాలే ప్రాణరక్షణ కవచాలు అని ఉద్యోగులకు సూచించారు. ఉద్యోగులకు భద్రతా నియమాలు, జాగ్రత్తలు, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. అధికారులు మాట్లాడుతూ భద్రత అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అని, సురక్షితమైన పనితీరు ద్వారా ప్రమాదరహిత వాతావరణాన్ని సృష్టించవచ్చని తెలిపారు. ఉద్యోగులు భద్రతా ప్రమాణాలను పాటిస్తూ సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఓ మాటూరి రవీందర్, ఏరియా ఇంజనీర్ రాజారావు, కేటీకే–1 కాలరీ మేనేజర్ ప్రవీణ్ విక్రమ్, కార్మిక సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులు నాణ్యతతో పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ ప్రతినిధి, జూన్ 4 (జనంసాక్షి):**ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలు నిర్ణీత సమయంలో నాణ్యత ప్రమాణాలు పాటించి పనులు పూర్తి చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. గురువారం సంగెం మండలం చింతలపల్లి గ్రామంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పంట కాలువల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి పనులు చేస్తున్న ప్రాంతాన్ని సందర్శించి ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. పనుల నాణ్యతను కాపాడుతూ నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. వేసవి, వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కార్మికుల భద్రతకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పని ప్రదేశాల్లో తాగునీరు, ప్రథమ చికిత్స సదుపాయాలు అందుబాటులో ఉంచాలని సూచించారు.కార్మికుల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ ఉపాధి హామీ పనులు సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.గ్రామ అభివృద్ధి ధ్యేయంగా పరిసరాలు పరిశుభ్రత పర్యావరణ పరిరక్షణ ప్లాస్టిక్ నియంత్రణ అంశాలపై జిల్లా కలెక్టర్ వారికి పలు సూచనలు చేశారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాస ప్రాముఖ్యతను వారికి వివరించారు. ఈ సందర్శనలో గ్రామ సర్పంచ్ బొమ్మ పావని, జడ్పీ సీఈఓ రామిరెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సత్తా చాటిన దమ్మన్నపేట విద్యార్థి



**రేగొండ, జూన్ 04( జనం సాక్షి):**జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన కూచన రాజేందర్, స్వప్న దంపతుల కుమారుడు కూచన గణేష్ జేఈఈ అడ్వాన్స్‌డ్–2026లో ప్రతిభ కనబరిచాడు. ఓబీసీ విభాగంలో 904వ ర్యాంకు సాధించి గ్రామానికి, కుటుంబానికి గర్వకారణంగా నిలిచాడు. జేఈఈ అడ్వాన్స్‌డ్–2026 ఫలితాలు ఇటీవల విడుదలయ్యాయి. చిన్నప్పటి నుంచే చదువులో మెరుగైన ప్రతిభ కనబరుస్తూ వచ్చిన గణేష్ పదో తరగతిలో 10 జీపీఏ సాధించాడు. అనంతరం ఇంటర్మీడియట్‌లో 980 మార్కులు సాధించి తన ప్రతిభను మరోసారి నిరూపించాడు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)లో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ చదవాలన్న లక్ష్యంతో కృషి చేసిన గణేష్, జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మంచి ర్యాంకు సాధించడం ద్వారా తన కలను సాకారం చేసుకునే దిశగా ముందడుగు వేశాడు.గణేష్ విజయంపై గ్రామస్థులు, బంధుమిత్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియ జేశారు. అతని విజయం గ్రామంలోని విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

# పట్టణాభివృద్ధికి సహకరించాలి

## తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్




తొర్రూరు, జూన్ 4( జనం సాక్షి):పట్టణాభివృద్ధికి అందరూ సహకారం అందించాలని మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్ తెలిపారు.ప్రజా పాలన-- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం డివిజన్ కేంద్రంలోని కూరగాయల అంగడి స్థలంలో 1, 2, 3 వార్డుల వార్డు సభలు నిర్వహించారు.ఈ సందర్భంగా చైర్మన్ శ్రావణ్ మాట్లాడుతూ వర్షా కాలంలో నీటి నిల్వలు లేకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ,తడి పొడి చెత్త వేరు చేసి మున్సిపల్ వాహనాలకు ఇవ్వాలని కోరారు. 200 చదరపు గజాల స్థలంలో ఇల్లు నిర్మాణం చేసే వారు తప్పకుండా ఇంకుడు గుంత నిర్మాణం చేయాలని, ప్రతి ఇంటిలో మొక్కలు నాటాలని సూచించారు.ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సహకారంతో పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు.ప్రజా ప్రభుత్వంలో మునిసిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వక్కల శ్యాంసుందర్, కౌన్సిలర్లు భూసాని జయమ్మ ఉప్పలయ్య, తూర్పాటి రవి, వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక, ఐసిడిఎస్ సూపర్ వైజర్ విజయ, మేనేజర్ కట్టస్వామి, వార్డు ఆఫీసర్లు పట్టాభి, కనకరాజు, రాంబాయి, వెంకన్న,ఉమేష్, మీనేశ్వర్, ముస్తాఫా,రవీందర్, పవన్ కళ్యాణ్,స్థానికులు పాల్గొన్నారు.

# డయాగ్నస్టిక్ ల్యాబ్‌లపై ఆకస్మిక తనిఖీలు



మంగపేట జూన్ 04 (జనంసాక్షి)మండల కేంద్రంలోని పలు స్థానిక డయాగ్నస్టిక్ ల్యాబ్‌లను గురువారం డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ క్రాంతి కుమార్, మండల వైద్యాధికారి డాక్టర్ అఖిల సంయుక్తంగా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజారోగ్యానికి భంగం కలగకుండా, నిబంధనల ప్రకారం ల్యాబ్‌లు నడుస్తున్నాయా లేదా అని నిర్ధారించుకోవడంలో భాగంగా ఈ తనిఖీలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. నిబంధనల ఉల్లంఘనలపై నిలదీతతనిఖీల్లో భాగంగా అధికారులు ల్యాబ్‌లలోని క్రింది కీలక అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీల్లో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు చెల్లుబాటులో ఉన్నాయా లేదా? రోజువారీ రోగుల వివరాలు నమోదు చేసే ఓపీ రిజిస్టర్లు సక్రమంగా నిర్వహిస్తున్నారా ల్యాబ్‌లలో తగినంత స్థలం, పరిశుభ్రత, నాణ్యమైన ల్యాబ్ సౌకర్యాలు ఉన్నాయా? అని వైద్యాధికారులు పరిశీలించారు.

# ఎంపిడిఓ పై సర్పంచుల ఆగ్రహం

## ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆందోళన



కౌటాల మే 04(జనం సాక్షి)గ్రామ పంచాయతీ నిధులను సకాలంలో అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఎంపిడిఓ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు.కౌటాల మండలంలోని 20 గ్రామ పంచాయతీలలో నిధుల కేటాయింపులో స్థానిక ఎంపిడిఓ నిర్లక్షం చేస్తున్నారని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు.నిధులను అందించడంలో ఎంపిడిఓ నిర్లక్షం వహించడంతో అభివృద్ధి పనులను పూర్తి చేసే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం అన్నారు.స్థానిక ఎంపిడిఓ సర్పంచులకు సరి అయిన గౌరవం ఇవ్వకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు.గ్రామ పంచాయతీలకు సంబంధించిన నిధులను సకాలంలో అందించేవరకు మండలంలో 20 గ్రామ పంచాయతీలకు ఎంపిడిఓ కు బాధ్యతలు అప్పగిస్తూ తమ సర్పంచ్ విధులను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. సొంత నిధులతో గ్రామ పంచాయతీలలో పనులు చేసిన బకాయిలను వెంటనే చెల్లించకుంటే సర్పంచుల సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.తమకు రావలసిన నిధులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచులు పాల్గొని నిరసన చేశారు.

# బడిబాట కార్యక్రమం నిర్వహణపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన

## జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్



మహబూబాబాద్ బ్యూరో, జూన్ 04(జనం సాక్షి):గురువారం కలెక్టరేట్ మొదటి అంతస్తు వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుండి ఇంచార్జ్ అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, జడ్పీ సీఈవో పురుషోత్తం, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణమూర్తి, అన్ని జిల్లా ప్రధాన అధికారులతో కలిసి 18 మండలాల ఎంపీడీవోలు మండల విద్యాశాఖ అధికారులతో బడిబాట కార్యక్రమం నిర్వహణ విజయవంతం పై జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టి నిర్వహిస్తున్న బడిబాట కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో తీసుకువెళ్లి ప్రతి ఒక్క విద్యార్థిని, విద్యార్థులను ప్రభుత్వ మండల ప్రాథమిక, జిల్లా ప్రజా పరిషత్ పాఠశాల, ప్రభుత్వ విద్యా సంస్థలలో చదువుకునే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ప్రభుత్వం అత్యాధునిక సౌకర్యాలు అత్యాధునిక విద్య నూతన టెక్నాలజీ ద్వారా విద్యను అందించడం జరుగుతుందని రుచికరమైన నాణ్యమైన ఆహారాన్ని పిల్లలకు అందించడం కోసం ప్రత్యేక డైట్ మెనూ ప్రవేశ పెట్టడం జరిగిందని, క్రీడలు మానసిక ఉల్లాసం ప్రశాంతత వాతావరణంలో విద్యను అభ్యసించడం కోసం ప్రభుత్వ విద్యాసంస్థలు సిద్ధంగా ఉన్నాయని ఇట్టి విషయాన్ని తల్లిదండ్రులకు పిల్లలకు తెలియజేసి ప్రభుత్వ విద్యాసంస్థలలో విద్యను అభ్యసించే విధంగా కార్యక్రమాలను రూపొందించి నిర్వహించాలన్నారు.జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కేంద్ర,రాష్ట్ర, ప్రభుత్వ నిధులతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు మన ఊరు మనబడి, అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులను వెంటనే పూర్తి చేయాలని విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రభుత్వ సూచించిన ప్రకారం టాయిలెట్స్ నిర్మించాలని అంతర్గత నిర్మాణ పనులు పూర్తి చేయాలని జూన్ 12న స్కూల్లో ప్రారంభం నేపథ్యంలో ప్రతి ఒక్కటి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.పాఠశాలలు, వసతి గృహాలలో పనిచేయుచున్న వంట సిబ్బంది, నాలుగవ తరగతి సిబ్బంది అందరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారినీ ఆదేశించారు. సి డబ్ల్యు సి,అంగన్వాడి కేంద్రాలలో చదువుతున్న పిల్లల వివరాలు, బడి ఈడు కు వచ్చిన పిల్లల వివరాలను క్షేత్ర స్థాయిలో సేకరించి నమోదు చేసి ప్రభుత్వ పాఠశాలలో చేరే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.పాఠశాలలు ప్రారంభానికి ముందే ప్రైవేటు విద్యాసంస్థలలో నడిచే వాహనాల యొక్క ఫిట్నెస్ తనిఖీలు నిర్వహించాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్లో అన్ని విభాగాల సంబంధిత అధికారులు, మండల కేంద్రాల నుండి ఎంపీడీవోలు ఎంఈవోలు తదితరులు పాల్గొన్నారు.

# శంకరాజుపల్లి పాఠశాలను 9వ తరగతి వరకు అప్‌గ్రేడ్ చేయాలి

## సర్పంచ్ దేవులపల్లి విజయ్ కుమార్



ఏటూరునాగారం,జూన్ 04(జనంసాక్షి).మండలం లోని శంకరాజుపల్లి గ్రామం లో ఎంపియుపిఎస్ పాఠశాల అభివృద్ధి కోసం గ్రామ సర్పంచ్ దేవులపల్లి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో సంబంధిత అధికారులకు గురువారం మెమోరండం సమర్పించారు.ప్రస్తుతం పాఠశాలలో 8వ తరగతి వరకు మాత్రమే విద్య అందుబాటులో ఉండటంతో, 8వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు 9వ మరియు 10వ తరగతుల చదువుల కోసం ఇతర పాఠశాలలకు వెళ్లవలసి వస్తోంది. దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి కారణంగా కొంతమంది విద్యార్థులు అడ్మిషన్ పొందినప్పటికీ క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు కావడం లేదు. ఫలితంగా విద్యకు దూరమై ఇంటి వద్దనే ఉండటం, రోడ్లపై తిరగడం వంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా గ్రామంలో ప్రీ-ప్రైమరీ (ప్రీ-ప్రైమరీ) విద్యను ప్రభుత్వ పాఠశాలలో ప్రారంభించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రస్తుతం ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశానికి అవకాశం లేకపోవడంతో, ప్రాథమిక విద్య కోసం ప్రైవేట్ పాఠశాలలను ఆశ్రయించాల్సి వస్తోంది. దీనివల్ల తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం పడటమే కాకుండా చిన్నారులను దూర ప్రాంతాలకు పంపాల్సిన పరిస్థితి నెలకొంటోంది. కాబట్టి విద్యార్థుల భవిష్యత్తు, గ్రామీణ విద్యాభివృద్ధి మరియు తల్లిదండ్రుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎంపియుపిఎస్ శంకరాజుపల్లి పాఠశాలను 9వ తరగతి వరకు అప్‌గ్రేడ్ చేయడంతో పాటు ప్రీ-ప్రైమరీ తరగతులను తక్షణమే మంజూరు చేయాలని సర్పంచ్ దేవులపల్లి విజయ్ కుమార్ అధికారులను కోరారు. గ్రామంలోని ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వం మరియు విద్యాశాఖ అధికారులు సానుకూలంగా స్పందించి పాఠశాల అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో తాటి నీలాద్రి, జాడి రమేష్, పుట్ట బిక్షపతి, ఆత్మూరి ఎల్లయ్య, సప్పిడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

## కాకతీయ కాలనీలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

## -పట్టణ ఎస్.ఐ.జాడి శ్రీధర్



రామకృష్ణాపూర్, జూన్ 04(జనంసాక్షి): పట్టణంలోని కాకతీయ కాలనీలో ఆర్కేపీ ఎస్ఐ జాడి శ్రీధర్ ఆధ్వర్యంలో గురువారం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలతో సమావేశమై వారి సమస్యలు, సూచనలు తెలుసుకున్నారు. అనంతరం సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో భాగంగా 32 ద్విచక్ర వాహనాలు, మూడు ఆటోరిక్షాలను తనిఖీ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ తదితర పత్రాలను పరిశీలించి, సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలపై మోటారు వాహనాల చట్టం ప్రకారం జరిమానాలు విధించారు.అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, ఆన్‌లైన్ లింకులు, ఓటీపీల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సూచించారు. మోసపూరిత ఘటనలు ఎదురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు లేదా సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

# ప్రధాని మోడీ చిత్రపటానికి పాలాభిషేకం



**జూన్ 04( జనం సాక్షి)** బుధవారం జరిగిన కేంద్ర క్యాబిట్ సమావేశంలో 63 జాతీయ రహదారి ఆర్మూర్- మంచిర్యాల మధ్య 5203 కోట్ల రూపాయలతో నాలుగు లైన్ల రోడ్డు విస్తరణకు ఆమోదం తెలిపినందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కి ధన్యవాదాలు తెలుపుతూ గురువారం నాడు బీజేపీ ఆధ్వర్యంలో మంచిర్యాల పట్టణంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి , బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ పాలాభిషేకం చేశారు .ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ నిధులతో మంచిర్యాల జిల్లా అభివృద్ధి చెందుతుంది అని తెలిపారు. మెరుగైన ఇన్ఫ్రాస్ట్రక్చర్ జిల్లా ప్రజలకు అందించడానికి మోదీ గారి ప్రభుత్వం జిల్లాలో జాతీయ రహదారుల మరియు రైల్వే స్టేషన్లు వేల కోట్ల రూపాయలు నిధులు వెచ్చించి వేగంగా అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. అందులో భాగంగా ఉత్తర మరియు దక్షిణ భారత దేశానికి మెరుగైన మరియు వేగవంతమైన రోడ్డు సదుపాయం కల్పించాలనే ఉద్దేశంతో గతంలో నాగపూర్ విజయవాడ కారిడార్ లో భాగంగా చందాపూర్- మంచిర్యాల జాతీయ రహదారి363 పూర్తి అయిందని, మంచిర్యాల విజయవాడ మధ్య జాతీయ రహదారి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. నిన్న ఆర్మూర్ - మంచిర్యాల 63 జాతీయ రహదారి నిర్మాణం కేంద్ర కాబినెట్ ఆమోదం తెలిపిందని అన్నారు. జిల్లా ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం, పారిశ్రామిక అభివృద్ధి మరియు సరుకు రవాణా కోసం మోదీ గారి ప్రభుత్వం జాతీయ రహదారుల విస్తరణ చేపట్టి దేశంలోని జాతీయ రహదారులకు అనుసంధానం చేస్తున్నారని తెలిపారు. మన పెద్దపల్లి ఎంపీ వంశీ కృష్ణ నేను జాతీయ రహదారి తెచ్చానని గొప్పలు చెప్పుకోవడం తప్ప జాతీయ రహదారి కోసం ఏనాడు కూడా కృషి చేయలేదని అన్నారు. జిల్లా బీజేపీ నాయకులు అనేక సార్లు కేంద్ర మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ గారిని జాతీయ రహదారి నిర్మాణం చేపట్టాలని కోరడం జరిగింది అని తెలిపారు. బీజేపీ నాయకుల కృషి వల్లనే జిల్లాకు జాతీయ రహదారులు, అమృత్ భారత్ రైల్వే స్టేషన్ మరియు వందే భారత్ రైలు వచ్చిందే తప్ప ఇందులో ఎంపీ కృషి ఏమాత్రం లేదని అన్నారు.ఈ కార్యక్రమంలో వంగపల్లి వెంకటేశ్వర్ రావు, ఎనగందుల కృష్ణ మూర్తి, సంజీవ్ రావు, బంగారు వేణు గోపాల్, అక్కల రమేష్, మల్యాల రాజమల్లు, ముదాం మల్లేష్, కుర్రె చక్రవర్తి, సత్రం రమేష్, ధన్ సింగ్, బేరా రామన్న యాదవ్, సప్పిడి నరేష్, బూర రాజశేఖర్ మరియు తతిదరులు పాల్గొన్నారు

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా

## అంగన్వాడీ కేంద్రంలో 'అమ్మ పేరుతో ఒక మొక్క'



**తాండూర్, జూన్ 04( జనం సాక్షి)** మంచిర్యాల జిల్లా : బెల్లంపల్లి నియోజవర్గం తాండూర్ లో రేచిని రోడ్ అంగన్వాడీ కేంద్రాన్ని బెల్లంపల్లి సీడీపీవో స్వరూపారాణి గురువారం సందర్శించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కేంద్రం ఆవరణలో 'అమ్మ పేరుతో ఒక మొక్క నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఐదేళ్ల లోపు పిల్లలందరినీ తల్లిదండ్రులు అంగన్వాడీ కేంద్రాల్లోనే చేర్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ రమాదేవి, అంగన్వాడీ టీచర్ విజయలక్ష్మి, ఆయా పాల్గొన్నారు

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

## డోడర్నా తండాలో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం



**కుబీర్, జూన్ 4, (జనంసాక్షి):** పర్యావరణాన్ని కాపాడటం కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి కర్తవ్యమని కుబీర్ మండల అటవీ శాఖ అధికారులు ఉద్ఘాటించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం డోడర్నా తండా-2లో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం అధికారుల పర్యవేక్షణలో ఘనంగా జరిగింది. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రాజేష్, యనిమల్ ట్రాకర్ శివప్రసాద్ ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించి, విద్యార్థుల్లో పర్యావరణ స్పృహను పెంపొందించారు. ఈ సందర్భంగా ఎఫ్.బి.ఓ రాజేష్ మాట్లాడుతూ.. అడవులు భూమికి ఊపిరితిత్తుల వంటివని, వాటిని కాపాడుకుంటేనే భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన గాలి, నీరు అందుతాయని వివరించారు. వన్యప్రాణుల సంరక్షణ, జీవవైవిధ్యం దెబ్బతినకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై యనిమల్ ట్రాకర్ శివప్రసాద్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 'అడవులు-మన భూమికి జీవనాధారం' అనే అంశంపై వ్యాస రచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించగా, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం ముఖ్య అతిథులు నాయక్ రంగారావు, ఉపసర్పంచ్ సుభాష్, ఆత్మ మెంబర్ శ్రీనివాస్ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.

# ప్రజల సంక్షేమాభివృద్దే ప్రభుత్వ లక్ష్యం

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**లక్షెట్టిపేట జూన్ 4, 2026: జనం సాక్షి**ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో ప్రభుత్వం చేపట్టిన గ్రామ డివిజన్ వార్డు సభలలో భాగంగా గురువారం జిల్లాలోని హాజీపూర్ మండలం రాపల్లి గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన గ్రామసభకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి సాయి వెంకట్ రెడ్డి, మండల విద్యాధికారి తిరుపతి, సర్పంచ్ రామ్ రెడ్డి లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రభుత్వం ఈ నెల 4, 6, 8, 10 తేదీల్లో ప్రత్యేక సభలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించడం జరిగిందని తెలిపారు. ఈసారి వర్షం తక్కువగా ఉన్నందున తదనుగుణంగా సాగు చేయగల పంటలను రైతులు ఎంపిక చేసుకోవాలని, ఆ దిశగా వ్యవసాయ, విస్తరణ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. యూరియా పంపిణీకి సంబంధించి యాప్ లో నమోదు చేయబడిన రైతులు, పంట, సాగు వివరాలకు అనుగుణంగా విడతల వారీగా యూరియా అందించడం జరుగుతుందని తెలిపారు. ఒకే రకమైన పంట సాగు చేయడం వలన భూసారం తగ్గుతుందని, ఈ పరిస్థితిని అధిగమించేందుకు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని, నానో యూరియా, డి ఎ పి, ప్రభుత్వం చేవీకరించబడిన విత్తనాలను మాత్రమే రైతులు వినియోగించాలని తెలిపారు. భూమి రకాన్ని బట్టి దాదాపు పత్తి పంట ఎకరానికి 14 నుండి 15 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని, రైతులకు మద్దతు ధర అందించడం జరుగుతుందని తెలిపారు. జన గణన



ప్రక్రియలో వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. విద్యా వ్యవస్థ బలోపేతం దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. జూనియర్ కళాశాలలలో విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయడం జరుగుతుందని, ఈ విద్యా సంవత్సరం వార్షిక ఫలితాలలో దాదాపు 98 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం జరిగిందని తెలిపారు. ఈ వేసవిలో ప్రజలకు ఎలాంటి త్రాగునీటి ఇబ్బందులు లేకుండా ముందస్తు కార్యాచరణతో చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. వైద్యం, విద్య, మహిళా రక్షణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు అంశాలపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో ప్రజలకు ఎదురయ్యే సమస్యలపై మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల తహసీల్దార్ల దృష్టికి తీసుకురావచ్చని, టోల్ ఫ్రీ నెంబర్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంపై అధికార యంత్రాంగం సమన్వయంతో పని చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# రహదారి ప్రమాదంలో గాయపడిన లైన్ ఇన్స్పెక్టర్ రామచందర్



**గోవిందరావుపేట. జూన్. (జనం సాక్షి) 04.06. 26.**మండలంలోని పసర గ్రామంలో విద్యుత్ శాఖలైన్ ఇన్స్పెక్టర్ దండు రామ్ చందర్ గురువారం రహదారి ప్రమాదంలో గాయాల పాలయ్యారు. స్థానికులు కథనం ప్రకారం విధి నిర్వహణలో భాగంగా మోటార్ బైక్ పై 163 జాతీయ రహదారి పై కర్షక్ సీడ్ మిల్ పరిధిలో అకస్మాత్తుగా కుక్కలు ఎదురు రావడంతో, బైక్ కింద పడిపోవడం జరిగింది. ప్రథమ చికిత్స జరుగుతోందని, స్వల్ప గాయాలకు బయటపడి కోరుకుంటున్నారని అన్నారు.

# రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్



**నెన్నెల్, జూన్ 4.( జనం సాక్షి)** నెన్నెల్ ,మండలంలోని జెండా వెంకటాపూర్, చిన్న వెంకటాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ గురువారం సందర్శించారు. కొనుగోలు ప్రక్రియ, ధాన్యం నాణ్యత, రైతులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజకు ప్రభుత్వంమద్దతు ధర కల్పించి కొనుగోలు చేస్తోందన్నారు. ధాన్యం విక్రయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, వారికి అన్ని విధాలుగా అండగా నిలిచి ఆదుకుంటామని పేర్కొన్నారు.కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, నీడ, ఇతర మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారానే విక్రయించి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందాలని సూచించారు.

# గ్రామ పంచాయతీలో మొక్కలు నాటిన సర్పంచ్

## వాంకుడోత్ సునీత కొమ్మాలు నాయక్

**గూడూరు,జూన్04(జనం సాక్షి):**పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించాలని గూడూరు మేజర్ సర్పంచ్ వాంకుడోత్ సునీత కొమ్మాలు నాయక్ అన్నారు.ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం గ్రామపంచాయతీ ఆవరణలో మొక్కలను నాటారు.ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రపంచ పర్యవరణ దినోత్సవం మనకు ప్రకృతి పట్ల బాధ్యతను గుర్తు చేస్తూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చెట్ల పెంపకం మరియు జీవవైవిద్య సంరక్షణను ప్రోత్సహించాలని, వాతావరణ మార్పుల ప్రభావాలపై చైతన్యం కల్పించాలని,గాలి,నీరు నేల కాలుష్యం ప్లాస్టిక్ వ్యర్థాలను దూరం చేయాలనీ అన్నారు.పర్యావరణాన్ని కాపాడటం అంటే మనల్ని మనం



కాపాడుకోవడమేని,ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చంటి స్వామి, కార్యదర్శి తిరుమల,వార్డు మెంబర్లు వాంకుడోత్ శ్రీనివాస్,గార్లపాటి శిరీష రాజేష్,వాంకుడు జ్యోతి, వాంకుడోత్ మౌనిక, గుగులోత్ వినోద,ఆశా వర్కర్స్,అంగన్వాడీ టీచర్స్, ప్రజా ప్రతినిధులు,గ్రామ ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

## పలు గ్రామాల్లో రైతు సేవల కేంద్రాలు ప్రారంభం



పాలకుర్తి, జూన్ 04(జనంసాక్షి) మండలంలోని పలు గ్రామాల్లో మహిళా శక్తి రైతు సేవా కేంద్రాలను వ్యవసాయ మార్కెట్ చైర్పర్సన్ లావుడ్యా మంజుల ప్రారంభించారు. గురువారం వావిలాల, గూడూరు, ఈరవెన్ను, చెన్నూరు, విష్ణుపురం గ్రామాల్లో మహిళా శక్తి రైతు సేవా కేం ద్రాలను ప్రారంభించిన అనంతరం మంజుల మాట్లాడుతూ మహిళల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని అందులో భాగంగానే మహిళా శక్తి రైతు సేవా కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని అన్నారు. ముఖ్యంగా మహిళలకు వడ్డీలేని రుణాలు, మహిళల పేరుతో పెట్రోలు బంకులు, ఆర్టీసీ బస్సులు కూడా నడుపుకునేందుకు ప్రభుత్వం మహిళా సంక్షేమానికి కృషి చేస్తోందని వివర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు మాచెర్ల స్వరూప, రజిత, శ్రీని వాస్, కుమారస్వామి, సోమయ్య, ఏపీఎం సీసీ శోభరాణి తదితరులు పాల్గొన్నారు.

## వరి కొయ్యలు కాల్చితే అపార నష్టం

### వ్యవసాయ అధికారి శ్రీజ



మల్హర్,జూన్ 04(జనంసాక్షి)రైతులు వరికొయ్యలను కాల్చడం ద్వారా అపార నష్టం వాటిల్లుతుంది. భూసారం తీవ్రంగా దెబ్బతినే ప్రమాదముంది. మంటల ద్వారా విపరీతమై వేడితో భూమి భూసారాన్ని కోల్పోతుంది. ముఖ్యంగా నత్రజని, పాస్పరస్ లాంటి పోషక పదార్థాల శాతం తగ్గి దిగుబడి తగ్గిపోతుంది భూమికి పదార్థంగా ఉపయోగపడే అవశేషాలు కాలిపోతాయి పంటలకు అవసరమైన ఖనిజలవనాలు దెబ్బతింటాయి. ఒక్కోసారి గాలి మంటలు అధికంగా వ్యాపించి మనుషులను కోల్పోయిన ఘటనలున్నాయి. వ్యవసాయ సా మగ్రి, పనిముట్లు ధ్వంసమైన సందర్భాలు సైతం ఉన్నాయి. కొయ్యకాలు నేలలో కలియదు న్నడం వల్ల సేంద్రియ కర్బన శాతం పెరిగి దిగుబడులు 5 నుంచి 10శాతం పెరిగే అవకాశం ఉన్నది. దుక్కిదున్నే సమయంలో సింగిల్ సూపర్ పాస్పేట్ చల్లితే అవశేషాలు రెండు వారాల్లో మునిగి పోషకాలుగా మారుతాయి. ఫలితంగా డిఏపీ వాడకం సగం వరకు తగ్గుతుంది. మొక్కలకు 2శాతం నత్రజని (యూరియా) 4శాతం పాస్పరస్ అదనంగా అందిస్తుంది. జింక్, మాంగనీస్, ఇనుము, కాల్షియం లాంటి సూక్ష్మ ధాతువులు పంటకు మేలు చేకూర్చుతాయి. నీటినిల్వ సామర్థం పెరుగుతుంది. అని మండల వ్యవసాయ అధికారి శ్రీజ పేర్కొన్నారు.

## రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని తహసిల్దార్ కు వినతి



స్టేషన్ ఘన్పూర్, జూన్ 04 ( జనం సాక్షి ) : రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని కోరుతు డివిజన్ కేంద్రంలోని తాసిల్దార్ కార్యాల యంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో తాహసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి తోట రమేష్ మాట్లాడు తూ వర్షాకాలం రోహిణి కార్తె మొదలైె వారం రోజు లు గడుస్తుంది కాబట్టి రైతులకు నాణ్యమైన విత్త నాలు అందించాలని కోరారు. అదేవిధంగా వ్య వసాయ అధికారులు రైతులకు అవగాహనసదస్సు లు నిర్వహించి, అధిక దిగుబడులకు సూచనలు ఇవ్వాలని, గ్రామ స్థాయి లో నకిలీ విత్తనాలు, పురుగుమందులు, ఎరువులపై సదస్సులు నిర్వ హించాలని కోరారు. ఈ కార్యక్రమం లో సిపిఐ మండల సహాయ కార్యదర్శి రహ్మతుల్లాహ్, నాయకులు బూర్ల యాదగిరి, పస్తం పృథ్విరాజ్, బుస్సా రోహిత్, జీడీ ఎల్లయ్య, బూర్ల మల్లిఖార్జు న్, అబ్బు, తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయ చదరంగంలో ఇందిరమ్మ ఇళ్లు.. కమిటీలపై ప్రజల్లో అసహనం



కాటారం, జూన్ 4 (జనం సాక్షి): ప్రతిష్ఠాత్మక ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో మండల వ్యాప్తంగా గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియను ప్రారంభించినప్పటికీ, కాటారం మండలంలోని కొన్ని గ్రామాల్లో ఇప్పటికీ తొలి విడత లబ్ధిదారుల జాబితా పూర్తిస్థాయిలో ఖరారు కాకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి రోజురోజుకు పెరుగుతోంది. ఇదే సమయంలో ఇందిరమ్మ కమిటీల పనితీరుపై కూడా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాటార మండలం గుంట్రత్ పల్లి గ్రామంలో గ్రామ సభ జరుగుతున్న సమయంలోనే గతంలో ఉన్న లిస్టులో పేరు ఉండి ప్రస్తుతం లిస్టులో తొలగించారని ఆవేశంతో నగునూరి శ్రీనివాస్ అనే వ్యక్తి ఆత్మహత్య ప్రయత్నానికి పాల్పడ్డాడు. గ్రామస్తులు అడ్డుకోవడంతో ప్రమాదం నుండి బయటపడ్డాడు గ్రామాల్లో మొదటి దశలో లిస్టులో పేర్లు ఉండి గ్రామపంచాయతీ ఎన్నికల తర్వాత ప్రస్తుతం పేర్లు తొలగించారని ఆవేదన గురవుతున్నారు. తొలి విడతలో దరఖాస్తు చేసుకున్న అనేక మంది అర్హుల పేర్లు జాబితాలో లేకపోవడం, అభ్యంతరాలు, ఫిర్యాదులు ఇంకా పరిష్కారంకాకపోవడం వల్ల లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు. రాష్ట్రంలో రెండో విడత ప్రక్రియ ప్రారంభమైనా, కాటారం మండలంలో మొదటి విడత ప్రక్రియ ప్రారంభం కాకపోవడంతో వివిధ గ్రామాలలోని ప్రజలు తమ పరిస్థితి ఏమిటో తెలియక ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇందిరమ్మ కమిటీలు పారదర్శకంగా వ్యవహరించడం లేదని, కొంతమంది అర్హులను పక్కనబెట్టి రాజకీయ, వ్యక్తిగత ప్రభావాలకు ప్రాధాన్యం ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిజమైన పేదలకు న్యాయం జరగడం లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకం రాజకీయ చదరంగంగా మారిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మొదటి విడత జాబితాలోని లోపాలను సరిదిద్ది, ఫిర్యాదులను పరిష్కరించి, అర్హుల ఎంపికలో పూర్తి పారదర్శకత తీసుకురావాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. రెండో విడతకు ముందుగా తొలి విడతలోని సందిగ్ధతను నివృత్తి చేయకపోతే ప్రజల్లో మరింత అసంతృప్తి పెరిగే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు. ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్ల అంశం మండల రాజకీయాల్లోనే కాకుండా గ్రామాల్లోనూ హాట్ టాపిక్‌గా మారింది.

## పారిశుద్ధ్య వాహనాలు ఎప్పుడూ అందుబాటులో ఉండాలి



వరంగల్ ఎంజీఎం, జూన్ 4 (జనంసాక్షి):పారిశుద్ధ్య సేవలకు ఉపయోగించే వాహనాలు ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిచిపోకుండా, మరమ్మతులు వేగవంతంగా పూర్తి చేసి ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ మరియు జీడబ్ల్యూఎంసీ ఇంచార్జి కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. గురువారం జీడబ్ల్యూఎంసీ కార్యాలయంలో వాహనాల నిర్వహణ, మరమ్మతులు, చెత్త సేకరణ, పారిశుద్ధ్య కార్యక్రమాలపై ఇంజినీరింగ్, పబ్లిక్ హెల్త్ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వాహనాల మరమ్మతులు పెండింగ్‌లో లేకుండా వెంటనే పూర్తి చేయాలని, రిపేర్ అవసరమైన వాహనాలను వాహన షెడ్‌లోనే ఉంచి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సూచించారు. చెత్త సేకరణకు ఉపయోగించే ఆటోలు లేదా ఇతర వాహనాలు మరమ్మతులకు వెళ్లిన సందర్భాల్లో ప్రత్యామ్నాయ వాహనాలను ఏర్పాటు చేసి పారిశుద్ధ్య సేవలకు అంతరాయం కలగకుండా చూడాలని ఆదేశించారు. త్వరలో ఏర్పాటు కానున్న 100 టన్నుల సామర్థ్యం గల తడి చెత్త ప్రాసెసింగ్ ప్లాంట్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని నగరంలో తడి చెత్త సేకరణను మరింత విస్తరించాలని సూచించారు. రోజుకు 100 టన్నుల తడి చెత్త ప్లాంట్‌కు చేరేలా ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. నగరంలోని అన్ని వార్డుల్లో చెత్త సేకరణ వాహనాలు నిర్దేశిత మార్గాల్లో పూర్తిస్థాయిలో తిరిగేలా రూట్ ఆప్టిమైజేషన్ అమలు చేయాలని, ఎక్కడా ఖాళీలు లేకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఏ ప్రాంతం మిగిలిపోయినా వెంటనే అదనపు వాహనాలను పంపించి సేవలు అందించాలన్నారు. ప్రతి వాహనంలో నాలుగు విభాగాల ద్వారా తడి చెత్త, పొడి చెత్త, గృహ ప్రమాదకర వ్యర్థాలు, శానిటరీ వ్యర్థాలను వేర్వేరుగా సేకరించాలని సూచించారు. స్వచ్ఛ భారత్ మిషన్ -- 2026 లక్ష్యాల సాధనలో భాగంగా వ్యర్థాల వర్గీకరణ (సెగ్రిగేషన్)పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే అంతర్గత మురుగు కాలువల పూడికతీత పనులను 100 శాతం పూర్తి చేయాలని, అవసరమైతే అదనపు కార్మికులను వినియోగించి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఫీల్డ్ సిబ్బంది ప్రతిరోజూ పనులను పర్యవేక్షించి పర్యవేక్షణ రిజిస్టర్లు నిర్వహించాలని సూచించారు. హనుమకొండ, వరంగల్ సర్కిళ్లలో పారిశుద్ధ్య వాహనాలకు ఇంధన సరఫరా నిరంతరాయంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, సెప్టిక్ ట్యాంకుల నుంచి సేకరించే మలినాలను ఎక్కడా అక్రమంగా డంపింగ్ చేయకుండా అమ్మవారిపేటలోని ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ కు మాత్రమే తరలించేలా కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, మున్సిపల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మాధవి, ఎంహెచ్ఓ రాజేష్, డీఈలు, ఐటీ మేనేజర్ రమేష్ శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్స్పెక్టర్లు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అటవీ శాఖ ఆధ్వర్యంలో వన దర్శిని కార్యక్రమం





నెన్నెల్, జూన్ 4.( జనం సాక్షి) రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో వన దర్శిని కార్యక్రమాన్ని నెన్నెల సెక్షన్ పరిధిలోని జోగాపూర్ గ్రామ సమీప అటవీ ప్రాంతంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అటవీ క్షేత్రాధికారి పి. దయాకర్ అటవీ వన్యప్రాణి సంరక్షణతో పాటు అటవీ ప్రాంతంలో శాఖ చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన నీటి కుంటలు, నీటి సంరక్షణ కోసం నిర్మించిన కందకాలను సందర్శకులకు చూపించారు. పెద్ద వరదల వల్ల భూమి కోతకు గురికాకుండా ఉండాలంటే చెట్ల పెంపకం అత్యంత అవసరమని ఆయన తెలిపారు. అటవీ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించినట్లు పేర్కొంటూ, ఎవరైనా ప్లాస్టిక్ వ్యర్థాలను అటవీ ప్రాంతంలో పారేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామ సర్పంచ్ శ్రీవిద్య మాట్లాడుతూ అటవీ అధికారులు సూచించిన విధంగా ప్రజలు నడుచుకోవాలని కోరారు. అటవీ శాఖ అధికారులు చేస్తున్న సేవలను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో నెన్నెల డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ బి. ప్రవీణ్ నాయక్, ఎఫ్ఎస్ఓలు శ్రీనివాస్, బాలకృష్ణ, రాందాస్, ఎఫ్‌బీఓలు మహేష్, శంకర్, రాజు, ఉప సర్పంచ్ వాణి, వార్డు సభ్యులు స్వామి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# అంతర పంటలతో రైతులకు అధిక దిగుబడులు

- జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్
- అప్పరాజుపల్లి,పొనుగోడు గ్రామ సభలు
- ఇందిరమ్మ ఇండ్లు,జనగణన సర్వే పరిశీలన

**గూడూరు, జూన్04(జనంసాక్షి):** రైతులు అంతర్ పంటలవైపు మొగ్గు చూపి, పంట మార్పిడి చేసుకోవడం వలన అధిక దిగుబడితో పాటు ఆదాయం పొందవచ్చని మానుకోట జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ రైతులకు సూచించారు. 99రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం కలెక్టర్ స్నేహ శబరిష్ అప్పరాజుపల్లి, పొనుగోడు గ్రామ సభలలో కేత్ బచావో అభియాన్ కార్యక్రమంపై అవగాహన సదస్సులో పాల్గొని, గ్రామాలలో తీసుకోవాల్సిన సమస్యలు, ఇందిరమ్మ ఇండ్లు,జనగణన సర్వేను పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేత్ బచావో అభియాన్ అనే కార్యక్రమం భారత ప్రభుత్వం మరియు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ చేపట్టిన ఒక వ్యవసాయ అవగాహన కార్యక్రమామని నేల ఆరోగ్యాన్ని కాపాడటం,అధిక రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుందని, సహజ వ్యవసాయాన్ని రైతులకు పరిచయం చేయడమే ప్రధాన లక్ష్యమని అన్నారు.రైతులు ప్రతి సంవత్సరం పంట మార్పిడి చేసుకోని,అంతర్ పంటలను పండించాలని,దీనివల్ల




రైతులకు అధిక ఆదాయంతో పాటు భూమికి చాలా ప్రయోజనాలు కలిగి,భూమి సారాన్ని కాపాడుతూ మంచి పోషకాలను అందించి, నేల సారం తగ్గకుండా, ఎరువుల ఖర్చు తగ్గుతుందని తెలిపారు. పప్పుధాన్యపు పంటలు నత్రజనిని నేలలో పెంచుతాయని,కీటకాలు మరియు వ్యాధులు తగ్గి, కలుపు మొక్కల నియంత్రణ పంట మార్పిడి వల్ల కలుపు మొక్కల పెరుగుదల తగ్గి,నీటి వినియోగం సమతుల్యం అవుతుందని,వేర్వేరు పంటలకు వేర్వేరు నీటి అవసరం ఉండటం వల్ల నీటి వాడకం సమర్థవంతంగా ఉండి,రైతుకు ఆర్థిక లాభంతో పాటు,వివిధ పంటల ద్వారా ఆదాయం స్థిరంగా ఉంటు, ఒక పంట నష్టపోయినా మరో పంట ద్వారా లాభం వస్తుందని తెలిపారు. వరి కొయ్యలు కాల్చడం వల్ల పర్యావరణానికి,ఆరోగ్యానికి, నేల నాణ్యతకు గణనీయమైన అనర్థాలు కలుగుతాయని,గాలి, కాలుష్యం,వరి కొయ్యలు కాల్చినప్పుడు పెద్ద మొత్తంలో పొగ,కార్బన్ డైఆక్సైడ్,కార్బన్ మోనాక్సైడ్,స్మాగ్ వంటి హానికర వాయువులు విడుదలై శ్వాసకోశ,ఆస్తమా, అలర్జీ,సమస్యలు పెంచుతాయని,నేల నాణ్యత తగ్గిపోయి నేలలోని ఉపయోగకరమైన సూక్ష్మజీవులు నాశనం అవుతాయని,.నేలలోని సేంద్రియ పదార్థం తగ్గి,పంటల దిగుబడి మీద ప్రభావం పడుతుందని,అగ్ని ప్రమాదం నియంత్రణ లేకుండా కాల్చితే పొలాల నుంచి పక్కనున్న ప్రాంతాలకు మంటలు వ్యాపించే ప్రమాదం ఉందని,పొలాల్లో కాలిన అవశేషాలు పశువులు తింటే వాటి ఆరోగ్యానికి హాని కలిగించవచ్చని,కొయ్యలను నేలలో కలపడం పశువులకు ఆహారంగా ఉపయోగించడం,బయోగ్యాస్ తయారీకి ఉపయోగించవచ్చని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ గూడూరు తాసిల్దార్ నాగ భవాని,మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ మాలిక్,ఇంచార్జ్ ఎంపీడీవో పృథ్వీరాజ్,అప్ప రాజు పల్లి గ్రామ సర్పంచ్ అజ్మీరా భరత్ నాయక్,పడమటి తండా సర్పంచ్ భాస్కర్ నాయక్,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## తాడిచర్లలో గ్రామ సభ



**మల్హార్, జూన్ 04(జనంసాక్షి) :** మండల కేంద్రమైన తాడిచర్ల గ్రామపంచాయతీ లో ప్రజపాలన కార్యక్రమం లో భాగంగా సర్పంచ్ బండి స్వామి అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో రాబొవు వర్షాకాల సన్నద్ధత, ఘన,ద్రవ వ్యర్థల నిర్వహణ, జల సంరక్షణ, డ్రగ్స్ నియంత్రణ, ట్రాఫిక్ రూల్స్, వ్యవసాయం, ఇతరత్ర అంశాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కాటారం సిఐ నాగార్జునరావు మాట్లాడుతూ యువత మాదకద్రవ్యల అలవాటుకు దూరంగా ఉండాలి అని సూచించారు. ఈ కార్యక్రమం లో తహసీల్దార్ కె రవికుమార్,ఎంపీడీఓ శ్యామ్ సుందర్,సిఐ నాగార్జున రావు,ఎస్ఐ వడ్లకొండ నరేష్,ఎస్ఐ 2 రాజన్,ఐకేపీ ఏపీఎం,ఇరిగేషన్ డిఇ, అగ్రికల్చర్ అధికారి శ్రీజ, ఎలక్ట్రికల్ ఎఇ,పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్ రెడ్డి,అన్ని శాఖల అధికారులు, వార్డ్ సభ్యులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ నమోదు చేసుకొని సహకరించాలి

**జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్**

**హనుమకొండ, ప్రతినిధి జూన్ 4 (జనం సాక్షి) :** జనగణన దేశ అభివృద్ధికి పునాది వంటిదని, ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వాలు ప్రణాళికలు రూపొందించేందుకు ఇది అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. గురువారం హనుమకొండలోని తన క్యాంపు కార్యాలయంలో జనగణన కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేటర్లకు కలెక్టర్ తన కుటుంబ వివరాలను నమోదు చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూజనగణన ద్వారా సేకరించే సమాచారం ఆధారంగానే విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాల రూపకల్పన జరుగుతుందని తెలిపారు. అందువల్ల ప్రజలు ఎటువంటి సందేహాలకు తావివ్వకుండా ఎన్యూమరేటర్లకు పూర్తి, ఖచ్చితమైన సమాచారం అందించాలని కోరారు. ప్రతి కుటుంబం ఈ జాతీయ కార్యక్రమంలో బాధ్యతగా భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ పిలుపునిచ్చారు.

## బాసర ట్రిపుల్ ఐటిలో మెరిసిన విద్యార్థులు





**గూడూరు, జూన్4 (జనంసాక్షి):** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం పొనుగోడు జెడ్పిహెచ్ఎస్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఈశ్వర్ 560,శేఖర్ 559,మార్కులు సాధించి, బాసర ట్రిపుల్ ఐటి లో సీట్లు సాధించారాని, ఇటీవల విడుదలైన 10వ, తరగతి ఫలితాల్లో గూడూరు మండల టాపర్స్ గా నిలిచారాని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ అర్జున్, మండల విద్యాశాఖ అధికారి ఆడెపు సుజాత తెలిపారు. ఈసందర్భంగా ఎంఈఓ సుజాత పొనుగోడు పాఠశాల ఉపాధ్యాయులను అభినందించారు.

## జిల్లా కలెక్టర్‌ను కలిసిన జిల్లా రవాణా అధికారి, ముఖ్య ప్రణాళిక అధికారి



**ములుగు ప్రతినిధి, జూన్ 04(జనంసాక్షి) :** ములుగు జిల్లాలో జిల్లా రవాణా అధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఠాకూర్ ఈశ్వర్ సింగ్, ములుగు జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారిగా అదనపు బాధ్యతలు స్వీకరించిన బి. సత్యనారాయణ రెడ్డి గురువారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావును కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తమ శాఖల పరిధిలో విధులను నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

## జిల్లా విద్యాధికారికి పిఆర్టియూ తెలంగాణ వినతి



**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇటీవల ఆదిలాబాద్ జిల్లా విద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మాధవికి గురువారం పిఆర్టియూ తెలంగాణ సంఘం ఆధ్వర్యంలో పుష్ప గుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. రాబోవు వర్క్ అడ్జస్ట్మెంట్ లో భాగంగా విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలలకు ముందుగా ప్రాధాన్యత ఇస్తే బాగుంటుందని వారు డీఈవోను కోరారు ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ విద్యాభివృద్ధికి అందరూ సహకరించాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆడే నూర్ సింగ్ నర్రా నవీన్ యాదవ్ లతో పాటు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కనక అభిమాన్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బి. విఠల్ గౌడ్, జిల్లా గౌరవ అధ్యక్షుడు డి.బాబన్న, జిల్లా కోశాధికారి ముజీబ్, జాదవ్ శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

## సింగరేణి ఏరియా ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స



**రామకృష్ణాపూర్, జూన్ 04(జనంసాక్షి):** మందమర్రి ఏరియా రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా ఆస్పత్రిలో వైద్యులు అరుదైన శస్త్రచికిత్సను విజయవంతం చేశారు. మోకాలు నొప్పితో బాధపడుతున్న ఒక కార్మికుడికి ఆర్థోపెడిక్ వైద్యులు డా. విక్రమ్, డా.నరేష్ మోకాలు మార్పిడి విజయవంతం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎంఓ డా. మధుకుమార్ వైద్యులను అభినందించి మాట్లాడారు. సింగరేణి కార్మికులకు, ఉద్యోగులకు నాణ్యమైన వైద్యం అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన వైద్యులు, నర్సింగ్ సిబ్బంది సహకారంతో పలు రకాల శస్త్ర చికిత్సలను విజయవంతంగా పూర్తి చేయడం జరుగుతుందన్నారు. భవిష్యత్తులో కార్మికులు వారి కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి యాజమాన్యం సిద్ధంగా ఉందని తెలిపారు.

## పందిని తప్పించబోయి బైక్‌పై నుంచి పడి వ్యక్తి మృతి



**కాసిపేట జూన్ 4 (జనం సాక్షి) :** మందమర్రి మండలం పులిమడుగు గ్రామానికి చెందిన లావుడ్య తిరుపతి (41) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, తిరుపతి మంగళవారం రాత్రి తన మోటార్‌సైకిల్‌పై బెల్లంపల్లి నుంచి పులిమడుగు గ్రామానికి వెళ్తుండగా, స్టేషన్ పెద్దనపల్లి సమీపంలోని ఎంఎంసీసీ క్రికెట్ అకాడమీ వద్ద రాత్రి సమయంలో ప్రమాదం చోటుచేసుకుంది. అతడు ప్రయాణిస్తున్న సమయంలో అకస్మాత్తుగా ఓ పంది రోడ్డుపైకి రావడంతో దానిని తప్పించబోయే క్రమంలో వాహనంపై నియంత్రణ కోల్పోయి కిందపడిపోయాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన తిరుపతిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య లావుడ్య మహేశ్వరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## లక్నవరం సరస్సును సందర్శించిన జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**గోవిందరావుపేట, (జనం సాక్షి) :** మండలంలోని లక్నవరం సరస్సును గురువారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ లక్నవరం సరస్సు పరిసర ప్రాంతాలను,ఉయ్యాల వంతెన, పర్యాటకులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలు,త్రాగునీరు, మరుగుదొడ్లు, పరిశుభ్రత,బోటింగ్ భద్రతా వంటి అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పర్యాటకులకు ప్రకృతి ప్రసాదించిన వరంగా లక్నవరాన్ని పేర్కొన్నారు. సహజ సిద్ధమైన గుట్టలు చెట్లు చిట్టడుగులతో ఆకర్షణీయంగా ఉందన్నారు. లక్నవరం పర్యాటక కేంద్రంలో పూర్తి వివరాలను మేనేజర్ శివ శంకర్ కలెక్టర్ కు వివరించారు.

## నేడు మాలేగాం, సోనారి పరిధిలో విద్యుత్ నిలిపివేత

**కుబీర్, జూన్ 04, (జనంసాక్షి):** కుబీర్ మండలంలోని మాలేగాం, సోనారి సబ్ స్టేషన్ల పరిధిలో గల గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ ఆదిత్య ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని, వర్షాకాలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ఉండేందుకు విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించే పనుల (మెయింటెనెన్స్) దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ కోత ఉంటుందని, ఈ సమయంలో వినియోగదారులు, రైతులు విద్యుత్ శాఖకు సహకరించాలని ఆయన కోరారు.